# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:78 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | శనివారం, అక్టోబర్ 24, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


## రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు.

# పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి



- సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రకటన
- నేరాల నియంత్రణకు హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని సీఎం వెల్లడి

**హైదరాబాద్,అమరావతి, ట్రైనెట్ న్యూస్:**దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్


మిగతాది 2లో


# యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలి

- ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం

# రేకుల షెడ్డు కింద చదువులు..

- స్పందించిన మంత్రి లోకేశ్



**అమరావతి,ట్రైనెట్ న్యూస్** అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్డు కింద చదువుకుంటున్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళితే, అల్లూరి సీతారామరాజు జిల్లా డూంబ్రిగూడ మండలంలోని ఓ పాఠశాలలో సరైన భవన సదుపాయం లేదు. దీంతో అక్కడి విద్యార్థులు ఓ తాత్కాలిక రేకుల షెడ్డు కింద కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ హృదయవిదారక దృశ్యాలను ఓ యువకుడు వీడియో తీసి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఠ' (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు.

# కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..



- బీజేపీ సంచలన ఆరోపణలు
- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ


మిగతాది 2లో




# ."గర్ల్‌ఫ్రెండ్‌ను చేసుకోవడంలో తప్పు లేదు.

- యువకులకు యూపీ గవర్నర్ కీలక సూచన!
- పిల్లలు పుట్టాక మహిళలను వదిలేయడం తప్పని యువతకు ఆనందీబెన్ పటేల్ హితవు


మిగతాది 2లో


# గతంలో ఎంపీ.. ఇప్పుడు జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్!

- అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మళ్లీ ఎన్నికల బరిలోకి
- రెండున్నరేళ్ల విరామం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ




మిగతాది 2లో


## బంగాళాఖాతంలో అల్పపీడనం..

- ఏపీలో భారీ వర్షాలు పడే అవకాశం



**అమరావతి,ట్రైనెట్ న్యూస్:**బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఈ మేరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఈ అల్పపీడనం అక్టోబర్ 24 వరకు తీవ్రరూపం దాల్చి.. వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇది అక్టోబర్ 25 వరకు మరింత తీవ్రరూపం దాల్చి తుఫానుగా మారుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావంతో అక్టోబర్ 26, 27, 28, 29వ తేదీల్లో ఉత్తరాంధ్రతో పాటు దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు నిపుణులు వెల్లడించారు. కాగా.. రాబోయే ఈ తుఫానుకు 'అర్నబ్' (బెంగాలీ భాషలో మహాసముద్రం) అని నామకరణం చేసినట్లు వాతావరణ నిపుణులు తెలిపారు.

# జగన్ దివాళాకోరుతనానికి ఇదే నిదర్శనం

- మంత్రి సత్యకుమార్




**అమరావతి, ట్రైనెట్ న్యూస్:**మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలను గొప్పగా చెప్పుకున్న జగన్.. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు వల్లించడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.గతంలో స్థానిక ఎన్నికల్లో 82 శాతం స్థానాలను గెలుచుకున్నామని చెప్పుకున్న జగన్.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 94 శాతం స్థానాల్లో ఎందుకు ఓటమి పాలయ్యారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన ఏకగ్రీవాలు.. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆధారాలతో మాట్లాడే ధైర్యం జగన్‌కు ఉందా? అని ప్రశ్నించారు.




# సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి

**దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు**

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఆదేశం
- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన



**హైదరాబాద్,అమరావతి, ట్రైనెట్ న్యూస్:** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ గారు ఇటీవల సూచనప్రాయంగా తెలియజేశారని చెప్పారు.


మిగతాది 2లో



మిగతాది 2లో

# పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి



మొదటి పేజీ తరువాయి
కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్పీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు.

### మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు

మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం

# సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి




మొదటి పేజీ తరువాయి
నీటి పారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, జూపల్లి కృష్ణారావు గారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారితో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీఠముడిగా ఉన్న అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకోవచ్చు, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు ఎంత నీటిని తరలించవచ్చనే వివరాలను నీటి పారుదల శాఖ ఇంజనీర్లు సమావేశంలో వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2,300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని తెలిపారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసి, సాధ్యమైనంత ఎక్కువ నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అందులో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి గారు తెలిపారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఏళ్ల తరబడి పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని అన్నారు. అందుకే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత, తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను ఆదేశించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, వాళ్లు కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సూచించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలి, ప్రస్తుతం ఉన్న కాల్వలు, సొరంగాల సామర్థ్యం సరిపోతుందా, లేదా ఎక్కడైనా కాల్వల సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంటుందా అనే అంశాలపై నీటి పారుదల విభాగం వెంటనే అధ్యయనం చేసి, అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. డిండికి నార్లాపూర్ నుంచి లేదా ఏదుల.. ఎక్కడి నుంచి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయం అవుతుందనే వివరాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వాటిలోని అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు.

## జగన్ దివాళాకోరుతనానికి ఇదే నిదర్శనం

మొదటి పేజీ తరువాయి
**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ప్రెస్‌మీట్‌లో చిరునవ్వులు చిందించడం ఆయన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా తప్పులతడకగా నామినేషన్లు వేసి డ్రామాలు ఆడుతున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. గతంలో పొరుగు రాష్ట్రాల నుంచి రౌడీలు, బౌన్సర్లు, మారణాయుధాలను ఎందుకు రప్పించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతపురం మేయర్ స్థానాన్ని బీజేపీకి కేటాయించగానే వైసీపీ ముస్లిం అభ్యర్థిని జగన్ ఎందుకు మార్చారని ప్రశ్నించారు. గతంలో ప్రజల ఆస్తులను లాక్కోవాలని చూసిన జగన్.. ఇప్పుడు ఆస్తుల రక్షణ గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

మొదటి పేజీ తరువాయి

- **రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న**
- **రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్**

**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

## గతంలో ఎంపీ.. ఇప్పుడు జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్!

మొదటి పేజీ తరువాయి
అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మళ్లీ ఎన్నికల బరిలోకి దిగారు. రెండున్నరేళ్ల విరామం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. కొయ్యూరు జెడ్పీటీసీ అభ్యర్థిగా పాడేరు ఐటీడీఏలో నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎంపీగా పనిచేసిన ఆమె ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. దివంగత మాజీ ఎమ్మెల్యే, గిరిజన ఉద్యమ నేత గొడ్డేటి దేముడు కుమార్తె అయిన మాధవికి 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2019 నుంచి 2024 వరకు ఎంపీగా పనిచేశారు. తాజాగా కొయ్యూరు జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్ వేయడంతో మాధవి మరోసారి ప్రత్యక్ష ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గతంలో పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేసిన ఆమె ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో కొయ్యూరు రాజకీయాల్లో చర్చ మొదలైంది.

# "గర్ల్‌ఫ్రెండ్‌ను చేసుకోవడంలో తప్పు లేదు

మొదటి పేజీ తరువాయి

- **ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే సంబంధాల్లోకి వెళ్లాలని సూచన**
- **గతంలో సహజీవనం, మహిళల పాత్రపై ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం**
- **తాజా వ్యాఖ్యలతో మరోసారి ఆనందీబెన్ పటేల్ అభిప్రాయాలపై చర్చ**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్:** ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ మరోసారి యువత సంబంధాలు, వివాహ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. గర్ల్‌ఫ్రెండ్‌తో పిల్లల్ని కని ఆ తర్వాత వారిని వదిలేయవద్దని యువకులకు ఆమె హితవు పలికారు. లక్నోలోని మహర్షి యూనివర్సిటీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. యువత మొదట ఆర్థికంగా నిలదొక్కుకుని, తాము ఏర్పరచుకున్న సంబంధాలకు బాధ్యత వహించాలని సూచించారు. "గర్ల్‌ఫ్రెండ్‌ను చేసుకోవడంలో తప్పు లేదు. ఒకవేళ గర్ల్‌ఫ్రెండ్‌ను చేసుకుంటే, పెళ్లి కూడా చేసుకోండి. ఒక అమ్మాయిని తల్లిని చేశాక వదిలేయడం చాలా తప్పు. యువకులారా, ముందుగా మీరు స్వయం సమృద్ధి సాధించండి" అని ఆనందీబెన్ పటేల్ స్పష్టం చేశారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త చర్చకు దారితీశాయి. ఆనందీబెన్ పటేల్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ ఆమె సహజీవన సంబంధాలు, సమాజంలో మహిళల పాత్రపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. గత ఏడాది అక్టోబర్ లో బలియా, వారణాసిలోని విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాల్లో మాట్లాడుతూ సహజీవన సంబంధాలపై యువతులకు హెచ్చరికలు జారీ చేశారు. సహజీవనం వల్ల కలిగే పరిణామాలను చూడాలంటే అనాథ శరణాలయాలను సందర్శించాలని, అక్కడ పిల్లలతో ఒంటరిగా ఉన్న యువతులు కనిపిస్తారని బలియాలో వ్యాఖ్యానించారు. ఆ మరుసటి రోజే వారణాసిలో మాట్లాడుతూ.. యువతులు సహజీవనానికి దూరంగా ఉండాలని, లేకపోతే '50 ముక్కలుగా నరికివేయబడటం' వంటి హింసాత్మక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీశాయి. అంతేగాక ఈ ఏడాది జులైలో కాన్పూర్‌లోని ఓ స్నాతకోత్సవంలో మహిళలు ఐఏఎస్ అధికారులుగా లేదా ఉపాధ్యాయులుగా మారడానికి ముందు 'నిపుణులైన తల్లులు'గా మారాలని సూచించారు. మహిళలు వంట నేర్చుకోవడం, వృత్తి జీవితాన్ని కుటుంబ బాధ్యతలతో సమన్వయం చేసుకోవడం గురించి కూడా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు కూడా అప్పట్లో వివాదాస్పదమయ్యాయి. తాజా వ్యాఖ్యలతో ఆనందీబెన్ పటేల్ మరోసారి వార్తల్లో నిలిచారు. మహిళల భద్రత, సామాజిక బాధ్యత కోణంలోనే తాను ఈ సూచనలు చేస్తున్నానని ఆమె చెబుతున్నప్పటికీ, ఆమె అభిప్రాయాలు తరచుగా లింగ సమానత్వం, ఆధునిక సమాజంలో యువతులు తమ జీవితంపై తీసుకునే నిర్ణయాలు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై విస్తృత చర్చకు దారితీస్తున్నాయి.

## యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలి

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శనివారం , అక్టోబర్,24, 2026

www.trinetnews.com

# భద్రతే అభివృద్ధికి పునాది

# తెలంగాణ ప్రగతికి టీజీఎస్పీఎఫ్ రక్షణ కవచం

**67ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్పీఎఫ్ భద్రత..**
**టీజీఎస్పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**అమీన్ పూర్ లో ఘనంగా తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 36వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
భద్రతే అభివృద్ధికి పునాది అని, రాష్ట్రంలోని కీలక సంస్థలకు రక్షణ కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్పీఎఫ్) సేవలు తెలంగాణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దళం సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణ అవకాశాలు, పని పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. శుక్రవారం తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన ఈ దళం 36 ఏళ్లలో విశిష్ట సంస్థగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ సచివాలయం, శాసనసభ, హైకోర్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రధాన దేవాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక సంస్థలు సహా మొత్తం 67 ముఖ్యమైన సంస్థలకు భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దాదాపు రెండు వేల మంది సిబ్బంది ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు.
టీజీఎస్పీఎఫ్ సేవలు కేవలం భవనాలు, సంస్థల రక్షణకే పరిమితం కావని, ప్రభుత్వ వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేసేలా చూడటంతోపాటు ప్రజల విశ్వాసాన్ని కాపాడే బాధ్యతను కూడా ఈ దళం నిర్వహిస్తోందని వివరించారు. దళం నినాదమైన 'ప్రగతికి రక్షణ' ఎంతో అర్థవంతమైనదని అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, ఆసుపత్రులు, విద్యాసంస్థల అభివృద్ధికి పటిష్టమైన భద్రత అవసరమని స్పష్టం చేశారు.భద్రత అనేది అభివృద్ధి తర్వాత వచ్చే అంశం కాదని, అభివృద్ధికి ముందస్తు పునాది అని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు పరిశ్రమలు స్థాపించాలన్నా,



వైద్యులు రోగులకు సేవలు అందించాలన్నా, రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావాలన్నా విశ్వసనీయమైన మౌలిక సదుపాయాలతోపాటు వాటికి పటిష్టమైన రక్షణ ఉండాలని చెప్పారు.

**విద్యుత్ కేంద్రాలకు కీలక రక్షణ**

విద్యుత్ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రిగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్రత్యేక రక్షణ దళం సేవల ప్రాధాన్యం తనకు మరింత స్పష్టంగా తెలుసని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి వంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు. అక్కడ ఇంజినీర్లు, కార్మికులు విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలు నిర్వహిస్తుంటే, ఆ కేంద్రాలకు భద్రత కల్పిస్తూ ఉత్పత్తి నిరంతరాయంగాసాగేలాటీజీఎస్పీఎఫ్సిబ్బందితోడ్పడుతున్నారని ప్రశంసించారు. విద్యుత్ వెలుగులు అందరికీ కనిపించినా, వాటిని కాపాడే భద్రతా సిబ్బంది కృషి చాలాసార్లు కనిపించదని, అయితే వారి సేవల విలువ ఎంతో గొప్పదని అన్నారు. గత 35 ఏళ్లలో భద్రతా రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఆధునిక నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ వ్యవస్థలతో అనుసంధానమైన భౌతిక మౌలిక సదుపాయాలు కొత్త సవాళ్లను తీసుకొస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో శారీరక దృఢత్వంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, అప్రమత్తత, వేగంగా స్పందించే సామర్థ్యం కూడా భద్రతా సిబ్బందికి అత్యంత అవసరమని వివరించారు అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని పేర్కొంటూ, శిక్షణ అనేది ఉద్యోగంలో చేరినప్పుడు పూర్తయ్యే ప్రక్రియ కాదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

**క్రమశిక్షణ, నిజాయితీనే సంస్థకు బలం**

భద్రతా వ్యవస్థ బలాన్ని ఆయుధాలతోనే కొలవలేమని, వాటిని ధరించే సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, వివేకం, బాధ్యతాయుత ప్రవర్తనతోనే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విధులకు అప్పగించిన అధికారాలను బాధ్యతగా వినియోగించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం సంస్థ ప్రతిష్ఠను నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రజల్లో భయాన్ని కలిగించడం కాకుండా భరోసా కల్పించడమే మంచి భద్రతా వ్యవస్థ లక్షణమని పేర్కొన్నారు. పండుగలు, సెలవు దినాలు, రాత్రివేళలు, అత్యవసర సమయాల్లోనూ భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. సిబ్బంది బాధ్యతలను అర్థం చేసుకుంటూ వారికి మానసిక బలాన్ని అందిస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ప్రశంసనీయమని అన్నారు. దళం అధికారులు, సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.
?తెలంగాణను మరింత అభివృద్ధి చెందిన, సమృద్ధమైన, సురక్షితమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో టీజీఎస్పీఎఫ్ పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రదర్శించిన క్రమశిక్షణ, అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. "మీరు కాపాడేది కేవలం భవనాలను కాదు.. ప్రజల విశ్వాసాన్ని. మీరు రక్షించేది కేవలం సంస్థలను కాదు.. తెలంగాణ ప్రగతిని" అని భట్టి విక్రమార్క పేర్కొంటూ, దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రపంచ వేదికపై భారత వ్యవసాయ పరిశోధనలకు గుర్తింపు

**గ్లోబల్ యూత్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు గెలుచుకున్న అమీనా నజ్రీన్**
**అంతర్జాతీయ సహకారానికి నాస్--కాస్ట్ అవగాహన ఒప్పందం**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
అమెరికాలో నిర్వహించిన ప్రపంచ ఆహార బహుమతి ఫౌండేషన్ సదస్సులో భారత వ్యవసాయ పరిశోధనల ప్రతిభను జాతీయ వ్యవసాయ శాస్త్రాల అకాడమీ (నాస్) చాటిచెప్పింది. అయోవా రాష్ట్రంలోని డెస్ మోయిన్స్‌లో అక్టోబర్ 20 నుంచి 22 వరకు 'బిఫోర్ హంగర్ విన్స్' ఇతివృత్తంతో జరిగిన 'నార్మన్ ఇ. బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్--2026'లో అకాడమీ పాల్గొంది.
నాస్--యువ ఎంపిక కార్యక్రమం ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన ఏడుగురు ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్లోబల్ యూత్ ఇన్‌స్టిట్యూట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ ఆహార భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వీరిలో అమీనా నజ్రీన్ ఏఎస్ గ్లోబల్ యూత్ ఇన్‌స్టిట్యూట్ అవార్డుతో పాటు 500 అమెరికన్ డాలర్ల నగదు బహుమతిని గెలుచుకున్నారు.సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనశాలలో నాస్, భారత వ్యవసాయపరిశోధనా మండలి (ఐసీఏఆర్) ప్రచురణలను ప్రదర్శించారు. భారత వ్యవసాయపరిశోధనలు,శాస్త్రీయపరిజ్ఞానం, విధానదృక్పథాలనుఅంతర్జాతీయపరిశోధకులు,విద్యావేత్తలు,విధాననిర్ణేతలకుపరిచయం చేశారు.'వ్యవసాయ ఉన్నత విద్య'పై నిర్వహించిన ప్రత్యేక చర్చలో నాస్ అధ్యక్షుడు, వ్యవసాయ పరిశోధన--విద్య విభాగం కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ వర్చువల్‌గా ప్రసంగించారు. వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత, జీవవైవిధ్య నష్టం, పోషకాహార అవసరాలను ఎదుర్కొనేలా వ్యవసాయ ఉన్నత విద్యను పునర్‌రూపకల్పనచేయాల పిలుపునిచ్చారు. ఉత్పత్తిపైనే దృష్టి కేంద్రీకరించకుండా సమగ్ర వ్యవసాయ--ఆహార వ్యవస్థలు, విలువ గొలుసు ఆధారిత విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యాసంస్థలు--పరిశ్రమల సహకారం, అంతర్జాతీయ పరిజ్ఞాన మార్పిడి, విదేశాల్లోని భారత వ్యవసాయ నిపుణుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నాస్, అమెరికాకు చెందిన కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాస్ట్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వ్యవసాయ పరిశోధన, సామర్థ్యాభివృద్ధి, పరిజ్ఞాన మార్పిడిలో సహకారాన్ని విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది.
యువ ప్రతిభను ప్రోత్సహించడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సుస్థిర వ్యవసాయం, ప్రపంచ ఆహార భద్రతకు వినూత్న పరిష్కారాలు సాధ్యమవుతాయని డాక్టర్ జాట్ పేర్కొన్నారు. అవార్డు విజేతతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

## నవంబర్ 3 నుంచి ఇండో--పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

**ఢిల్లీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న భారత నౌకాదళం**
**శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారంపై 18 దేశాల నిపుణుల చర్చలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారత నౌకాదళం నవంబర్ 3 నుంచి 5 వరకు న్యూఢిల్లీలో ఇండో--పసిఫిక్ రీజినల్ డైలాగ్--2026 (ఐపీఆర్‌డీ) నిర్వహించనుంది. నేషనల్ మారిటైమ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ అంతర్జాతీయ వ్యూహాత్మక సదస్సులో 18 దేశాలకు చెందిన నిపుణులు పాల్గొననున్నారు.
'ఇండో--పసిఫిక్‌లో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారం' ప్రధాన ఇతివృత్తంగా సదస్సు జరగనుంది. సముద్ర పరిశోధనలు, విద్యాసంస్థల అనుసంధానం, మానవ వనరుల అభివృద్ధి, సముద్ర పాలన, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించనున్నారు.
భారత్ ప్రతిపాదించిన ఇండో--పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లోని సహకార అంశాలను ఆచరణాత్మక ప్రతిపాదనలుగా మలచడంపై సదస్సు దృష్టి సారించనుంది. 'మహాసాగర్' సముద్ర దార్శనికతకు అనుగుణంగా ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి భాగస్వామ్యాలను ప్రోత్సహించనుంది.
మూడు రోజుల కార్యక్రమంలో ఐదు ప్రధాన చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యా--పరిశోధన నెట్‌వర్క్‌లు, కీలక సముద్ర మౌలిక




వసతుల రక్షణ, సముద్ర విజ్ఞానం, వాతావరణ సవాళ్లు, సముద్ర పాలనలో సహకారం, పౌర--రక్షణ రంగాల్లో ఉపయోగపడే సాంకేతికతల ప్రభావాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు. సంయుక్త పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ సమాచార మార్పిడి, సంస్థాగత భాగస్వామ్యాలకు కార్యాచరణ మార్గాలను చర్చించనున్నారు.
ప్రారంభ రోజున 'పర్‌స్పెక్టివ్స్ ఫ్రమ్ ది ఫ్లాగ్ బ్రిడ్జ్' ప్రత్యేక సమావేశంలో భారత్, శ్రీలంక మాజీ నౌకాదళాధిపతులు పాల్గొననున్నారు. 'సహయోగ్ కా సంవాద్' పేరిట రాయబారులతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి రోజు స్మారకోపన్యాసం చేయనున్నారు.వాతావరణ మార్పులు, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు, సముద్ర వనరులపై ఒత్తిడి వంటి సరిహద్దులు దాటిన సవాళ్లకు ఉమ్మడి పరిష్కారాలను అన్వేషించనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, జీవ శాస్త్రాలు, మానవీయ శాస్త్రాల పాత్రనూ పరిశీలించనున్నారు. జాతీయ, ఉపప్రాంతీయ, ప్రాంతీయ స్థాయుల్లో అమలు చేయగల నిర్దిష్ట చర్యలను గుర్తించడమే సదస్సు ప్రధాన లక్ష్యం.

## ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 30న జాబ్ మేళా

### మణప్పురం ఫైనాన్స్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు.. రూ.20 వేల వరకు వేతనం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నారు. మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో వెల్లడించింది.

**డిగ్రీ, డిప్లొమా అభ్యర్థులకు అవకాశం**

ఈ జాబ్ మేళా అక్టోబర్ 30, 2026న ఉదయం 11 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జరగనుంది. ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందని తెలిపారు.

**సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలి**

ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు నేరుగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఉద్యోగాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ రవీందర్ కుమార్‌ను 6261688998 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో సూచించింది.

## ఎల్‌నినో ప్రపంచవ్యాప్త ప్రభావాలపై ప్రజలను చైతన్య పర్చాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి**
**సమాచార, పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**





**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
ఎల్‌నినో ప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై చూపే ప్రభావం, వాటి వల్ల తలెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్య పర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఎల్-నినో చూపే ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు.
శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార శాఖ అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులకు నిర్వహించిన ఒకరోజు చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్. మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోందని , దాని ప్రభావాలను ఎదుర్కొనేందుకు ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో 20 శాతానికి పైగా వర్షపాతం తక్కువగా నమోదయింది అన్నారు. దీనితో, దాదాపు 20 శాతం పంట విస్తీర్ణం తగ్గిందని, తద్వారా సరిపడా ధాన్యం, పశుగ్రాసం తగ్గిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో కేవలం 30 నుండి 40 శాతం నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రానున్న జులై మాసం వరకు తాగు నీటికి అత్యంత ప్రాధాన్య నిస్తున్నామని వివరించారు. గత మూడు నెలలుగా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరుగుతోందని, అత్యధికంగా 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని వెల్లడించారు. ఎల్నినో పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు.

**రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు అవగాహన కార్యక్రమాలు**

సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణానికి ఈ ప్రచారాన్ని విస్తరించి, ప్రజలందరికీ ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్ డోర్ మీడియా , సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికే, జానపద కళారూపాల ప్రభావం గ్రామీణ ప్రజలపై గణనీయంగా ఉంటుందని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ సందేశాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.
రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా పౌరసంబంధాల అధికారులు (డీపీఆర్వోలు), తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చైతన్యం, అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని చేరవేసి, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

**ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

నీటిని , విద్యుత్ ను అత్యంత పొదుపుగా వాడడం, ఎండల సమయంలో తగినంత నీరు తాగడం, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండడం, వృద్ధులు, చిన్నారులు, ఇతర సున్నిత వర్గాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించడం, నీటి వనరులను



సమర్థంగా నిర్వహించడం, నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సూచనలు, హెచ్చరికలు నిరంతరం చేరేలా వ్యవసాయ, విద్యుత్, పశు సంవర్ధక , రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్ సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, సమాచార, పౌరసంబంధాల శాఖ మరియు తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ప్రచార కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎ. నరసింహ రెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, శ్రీనివాస్, మధు సూధన్ తో పాటువ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు, రాష్ట్రం లోని అన్ని జిల్లాల పౌర సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

## ఉక్కు దిగుమతి సమస్యలపై 28న ఓపెన్ హౌస్

### పాల్గొనే సంస్థలు 26వ తేదీ మధ్యాహ్నంలోగా వివరాలు పంపాలి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
ఉక్కు దిగుమతులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అక్టోబర్ 28న ఓపెన్ హౌస్ నిర్వహించనుంది. న్యూఢిల్లీలోని నేతాజీ నగర్ జీపీఓఏ--3 భవనం మూడో అంతస్తులోని స్టీల్ రూమ్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది.
స్టీల్ ఇంపోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ (సిమ్స్), సరళ్ సిమ్స్, నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల మినహాయింపు (క్యూసీఓ ఎగ్జెంప్షన్) అంశాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న కంపెనీలు, సంఘాలు తమ అభ్యర్థనలను సమర్పించవచ్చు. పాల్గొనదలచిన సంస్థలు అక్టోబర్ 26 మధ్యాహ్నం 12 గంటల్లోగా tech-steel@nic.inకు ఈమెయిల్ పంపి సమయాన్ని నిర్ధారించుకోవాలి.
ఈమెయిల్‌లో కంపెనీ లేదా సంఘం పేరు, పరిశ్రమ--ఉత్పత్తి వివరాలు, సమస్యకు సంబంధించిన విభాగం, దరఖాస్తు రిఫరెన్స్ ఉంటే ఆ వివరాలు పేర్కొనాలి. సమస్యను గరిష్ఠంగా 50 పదాల్లో వివరించడంతోపాటు పాల్గొనే ప్రతినిధి పేరు, హోదా, మొబైల్ నంబర్, ఈమెయిల్ చిరునామా అందించాలి.
ప్రతి సంస్థ నుంచి ఒక్క ప్రతినిధికి మాత్రమే అనుమతి ఉంటుంది. మూడో వ్యక్తి ద్వారా ప్రాతినిధ్యం వహించేందుకు అనుమతించరు. ముందస్తు నిర్ధారణ లేకుండా నేరుగా హాజరయ్యే అవకాశం లేదని, కేటాయించిన సమయాన్ని ఈమెయిల్ ద్వారా తెలియజేస్తామని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## జనవరి నుంచి పీఎల్ఎఫ్ఎస్‌లో మార్పులకు ప్రతిపాదనలు

**డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక ప్రాధాన్యం**
**ప్రజలు, పరిశోధకుల నుంచి 15 రోజుల్లో సూచనలకు ఆహ్వానం**

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:
ఆవర్తన శ్రామిక శక్తి సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నమూనా రూపకల్పన, అంచనా విధానం, ప్రశ్నావళిలో 2027 జనవరి నుంచి మార్పులు ప్రవేశపెట్టాలని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రతిపాదించింది. ఈ మార్పులపై విధాన నిర్ణేతలు, పరిశోధకులు, విద్యా--పరిశోధన సంస్థలు, సాధారణ ప్రజలు పత్రికా ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్ఎస్ఓ 2017 నుంచి ఈ సర్వే నిర్వహిస్తోంది. ఉపాధి మార్కెట్‌కు సంబంధించిన నెలవారీ, త్రైమాసిక, వార్షిక అంచనాలు అందించేందుకు 2025 జనవరిలోనమూనావిధానాన్నిపునర్వ్యవస్థీకరించింది. 2026 జనవరి నుంచి డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికుల సమాచారాన్ని ప్రయోగాత్మకంగా సేకరిస్తోంది.ప్రస్తుత విధానంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్మికులు తగిన సంఖ్యలో సర్వే పరిధిలోకి రావడం లేదని గుర్తించిన నేపథ్యంలో, వారి కుటుంబాలను ఎంపిక చేసేందుకు ప్రత్యేక ద్వితీయ దశ వర్గాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రతిపాదిత విధానంలో గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు, పట్టణ ప్రాంతాల్లో ఐదు వర్గాలు ఉంటాయి. ఎంపిక చేసిన ప్రతి ప్రథమ దశ నమూనా యూనిట్‌లో 14 కుటుంబాలను సర్వే చేయనున్నారు.

2027--2028 రెండేళ్ల కాలానికి నవీకరించిన నమూనా చట్రం ఆధారంగా కొత్త నమూనాలను ఎంపిక చేయనున్నారు. పట్టణీకరణలో మార్పులు, కొత్త పట్టణ ప్రాంతాలు, జిల్లాలు ఇతర పరిపాలనా విభాగాల ఏర్పాటు, విభజన, విలీనాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. దీనివల్ల ప్రస్తుత జనాభాకు మెరుగైన ప్రాతినిధ్యం లభించి, అంచనాల విశ్వసనీయత పెరుగుతుందని ఎన్ఎస్ఓ భావిస్తోంది.
కొత్త విధానానికి మారే ప్రక్రియలో భాగంగా 2027 జనవరి నుంచి తొలి మూడు నెలలు పాత, కొత్త నమూనా చట్రాల నుంచి ఎంపిక చేసిన యూనిట్లను కలిపి నెలవారీ అంచనాలు విడుదల చేయనున్నారు. ఈ మూడు నెలలకు సాపేక్ష ప్రామాణిక దోషం (ఆర్ఎస్ఈ) అంచనాలను ప్రకటించరు.డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పనిచేసిన సభ్యులు కుటుంబంలో ఉన్నారా అనే విషయాన్ని గుర్తించేందుకు గ్రామీణ, పట్టణ కుటుంబాల ప్రశ్నావళిలో అదనపు ప్రశ్న చేర్చనున్నారు. అలాగే సొంత వినియోగానికి వస్తువుల ఉత్పత్తి, వేతనం లేని ఇంటిపనులు, సంరక్షణ సేవలు, స్వచ్ఛంద సేవ, వేతనం లేని శిక్షణ పనులపై కొత్త ప్రశ్నలు ప్రవేశపెట్టనున్నారు. తొలి సందర్భనలో 15 ఏళు పైబడిన వారి నుంచి ఈ వివరాలు సేకరించి, వార్షికంగా నివేదించనున్నారు.
ప్రతిపాదిత మార్పుల పూర్తి వివరాలతో కూడిన భావనాపత్రాన్ని మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.mospi.gov.inలో అందుబాటులో ఉంచినట్లు ఎన్ఎస్ఓ తెలిపింది.

## దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి

**పోలీసు శాఖల్లో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర సంస్కరణలతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:
దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సంస్కరణలు తీసుకురావాలని, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ (ా్రాజజ) సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య నేరాల నియంత్రణ, సమాచార మార్పిడి, సరిహద్దులు దాటి పోలీసు సమన్వయం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలిచింది.

**పోలీసింగ్‌లో నిరంతర సంస్కరణలు అవసరం**
సమాజానికి భద్రత, రక్షణ అత్యంత ముఖ్యమైన పునాదులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమర్థవంతంగా, నైతిక విలువలతో, నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాలను కూడా ఎప్పటికప్పుడు ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు వ్యవస్థకు అందించే వనరులను కేవలం ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు చేసే పెట్టుబడిగా పరిగణిస్తున్నామని వివరించారు. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ప్రతి పోలీసు విభాగం తన పనితీరును మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

**హైదరాబాద్‌లో మూడు పోలీసు కమిషనరేట్లు**
నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కమిషనర్ తన పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.
అలాగే వివిధ రకాల నేరాలు, ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు హైడ్రా , ఈగల్ , టీ -సేఫ్ వంటి విభాగాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలను ప్రధాన సవాళ్లుగా పేర్కొంటూ, వీటి నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ, సమర్థవంతమైన కార్యాచరణ అవసరమని అన్నారు.

**తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీసు సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, నక్సలిజం నిర్మూలన వంటి రంగాల్లో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని చెప్పారు.ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం కేంద్ర ప్రభుత్వం నుంచి 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించే విషయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందన్నారు.

**ఆహార కల్తీ నియంత్రణకు టీజీ -సేఫ్**
ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను పటిష్టం చేయడం కోసం వివిధ విభాగాల ప్రయత్నాలను సమన్వయం చేసేందుకు అమెరికాలోని ఎఫ్డీఏ తరహాలో టీజీ -సేఫ్ అనే కొత్త విభాగాన్ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.
చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక విభాగాల పనితీరు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించడం ద్వారా తెలంగాణ దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు.

**పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం**
విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు పోలీసు సిబ్బంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు, కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించడంతోపాటు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**రాష్ట్రాల మధ్య సమన్వయమే కీలకం**
నేటి పరిస్థితుల్లో ఏ ఒక్క రాష్ట్రం తన ప్రయత్నాలతో మాత్రమే నేరాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నేరగాళ్ల కార్యకలాపాలు రాష్ట్రాల సరిహద్దులను దాటి విస్తరిస్తున్న నేపథ్యంలో పోలీసు విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు.
రాష్ట్రాల పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య సమాచార మార్పిడిని వేగవంతం చేసేలా పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సీఆర్పీసీసీ సమావేశంలో పాల్గొన్న అధికారులకు సూచించారు. సరిహద్దులు దాటి పనిచేసే నేరగాళ్లపై సమర్థవంతమైన చర్యలు తీసుకునేందుకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆకాంక్షించారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక మౌలిక సదుపాయాలను, హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను పంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రకటించారు. సమావేశంలో సమగ్ర చర్చల అనంతరం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దక్షిణ భారతదేశాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ డాక్టర్ ఎం.ఏ. సలీమ్, తమిళనాడు డీజీపీ డాక్టర్ మహేష్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలిని సింగ్, లక్షద్వీప్ ఏడీజీ బి. శంకర్ జైస్వాల్, కేరళ ఐజీ అజీతా బేగం, ఆంధ్రప్రదేశ్ ఐజీపీ రవి కృష్ణ, .
వీరితోపాటు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, సీఐడీ డీజీ చారు సిన్హా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఆపరేషన్స్ విభాగం డీజీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత భారీగా తరలిరావాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

## కంటోన్మెంట్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం.. సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :
అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని టీచర్స్ కాలనీ పార్క్ వద్ద హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ పాల్గొన్నారు. ఓటరు నమోదుకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**నవంబర్ 6 వరకు ఓటరు నమోదుకు అవకాశం**
ఎమ్మెల్యే శగణేశ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం తప్పనిసరని పేర్కొన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
పట్టభద్రులందరి ఓట్లను నమోదు చేయించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు.

**పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల సమస్యలపై గళమెత్తే సామర్థ్యం ఉన్న యువ నాయకుడు సామ రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు సహా వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు.
పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వాలు, సంబంధిత వేదికల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

**ఓటు హక్కును కాపాడుకోవాలి**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు హక్కు పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, పట్టభద్రులు తమ హక్కులను వినియోగించుకోవడంతోపాటు తమ సమస్యలను ప్రాతినిధ్యం వహించే నాయకులను ఎన్నుకోవడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

## మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశం.. డిండి, అచ్చంపేటకు అదనపు నీటి కేటాయింపులు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :
రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులు, నిర్మాణ ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మహారాష్ట్రతో త్వరలో చర్చలు**
తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరిపేందుకు సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ తర్వాత చర్చలకు పిలుస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో చర్చలకు అవసరమైన అన్ని నివేదికలు, సాంకేతిక వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.
152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది, మహారాష్ట్ర పరిధిలో ఎంత మేర భూమి ముంపునకు గురవుతుంది అనే అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాలు, గిరిజనులు అధికంగా నివసించే వెనుకబడిన ప్రాంతాలతో కూడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా బ్యారేజీ ఎత్తు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో చర్చించినఅంశాలు,వాటికిసంబంధించిన వివరాలన్నింటినీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర సమన్వయం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, ముంపు ప్రభావంపై సమగ్ర సమాచారంతో చర్చలకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**డిండి, అచ్చంపేటకు అదనపు నీరు**
డిండి ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత పెంచే దిశగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అవసరాల కోసం మొత్తం 0.6 టీఎంసీల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని ఏదుల రిజర్వాయర్ వరకు తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా డిండి, అచ్చంపేట ప్రాంతాల అవసరాలను తీర్చడంతోపాటు పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నీటిని తరలించేందుకు అవసరమైన పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర సాంకేతిక వ్యవస్థల ఏర్పాటును వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.
సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర చర్చలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో జరగనున్న చర్చలు, డిండి--అచ్చంపేట పథకాలకు అదనపు నీటిని తరలించేందుకు చేపట్టే ఏర్పాట్లు తదుపరి కీలక పరిణామాలుగా నిలవనున్నాయి.

## మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి

## ప్రారంభించిన నెల రోజుల్లోనే మంచి స్పందన

**మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 3,885 కాల్స్**



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:
తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దార్శనిక నాయకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే సేవలను అందించేందుకు మీ సేవా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది. ప్రజలు ఇకపై ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల అప్ డేట్ వంటి పలు సేవలను తమ ఇంటి వద్దనే పొందవచ్చు.లి
ఇందుకోసం మీ సేవా కేంద్రాలు లేదా ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, క్యూలలో వేచి ఉండకుండా మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ సేవ ద్వారా సేవలను పొందే అవకాశం కల్పించారు. ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేయడం, మీసేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఆతర్వాత మీ సేవా ప్రతినిధి నిర్ణీత సమయంలో ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.

**ప్రారంభం నుంచే లభించిన మంచి స్పందన**
ఈ సేవ ప్రారంభమైన మొదటి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ప్రజల నుంచి 3,885 కాల్స్ వచ్చాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకమైన పాలనను అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దార్శనికతలో ఈ కార్యక్రమం ఒక భాగం.
ప్రస్తుతం ఈ డోర్‌స్టెప్ సేవలు క్యూర్ (క్యూర్ ) పరిధిలోని ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బుక్ చేసుకున్న సర్వీస్ ప్రకారం వర్తించే సేవా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

**డోర్ స్టెప్ సేవలను ఎలా పొందాలి..?**
1. టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేయండి లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయండి.
2. అవసరమైన ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ సేవను ఎంచుకుని, కాల్ సెంటర్ ప్రతినిధికి అవసరమైన వివరాలను అందించండి.
3. నిర్ణయించిన సమయంలో మీ సేవా డోర్‌స్టెప్ ప్రతినిధి మీ ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.

## క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:
క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణ పేదల ఉపాధికి ఆటంకం కలగకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లను నిర్మించి సొంతింటి కల నెరవేర్చుతామని పేర్కొన్నారు.
రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు విడతల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను త్వరగా గుర్తించాలని, భూముల ఎంపికలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. స్థలాల గుర్తింపు నుంచి నిర్మాణాల ప్రారంభం వరకు నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ఇదిలా ఉండగా, మూడు జిల్లాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులకు న్యాయం జరిగేలా హౌసింగ్ కార్పొరేషన్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడంతోపాటు, డ్రా వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం కల్పిస్తామని మంత్రి వెల్లడించారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం, అక్టోబర్,24, 2026
www.trinetnews.com

# నేడు ఏపీఎస్ఆర్టీసీ జేసీ నేతలతో జేఎండీ సమావేశం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ఏపీఎస్ఆర్టీసీలోఉద్యోగులుఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం, సంస్థ రక్షణే ధ్యేయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది.ఇందులోభాగంగానేనేడుశుక్రవారంమధ్యాహ్న ం3 గంటలకు విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఆర్టీసీ జేసీ నేతలతోజేఎండీఅత్యంతకీలకమైనసమావేశంనిర్వహించనున్నా ర.జేఏసీ నోటీసులపై చర్చ: ఆర్టీసీ జేఏసీ జారీ చేసిన అధికారిక నోటీసులోని ప్రధానాంశాలపై ఈ భేటీలో ఆర్టీసీ యాజమాన్యంసుదీర్ఘంగాచర్చించనుంది.

సంస్థ పరిరక్షణ: ప్రజా రవాణా వ్యవస్థను నడిపిస్తున్న ఆర్టీసీ సంస్థను మరింత పటిష్ఠం చేయడం మరియు సంక్షోభాల నుండి పరిరక్షించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం: కార్మికులు మరియు



ఉద్యోగులు రోజువారీ విధుల్లో ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి.

ఈ భేటీకి సంబంధించి ఆర్టీసీ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు.. పోలింగ్ మారనుందా?




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నవంబర్ 3న ఒకే రోజు జరగనున్నాయి. దీనివల్ల అధికారులపై తీవ్ర భారం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నామినేషన్ ప్రక్రియలోనే అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో, ఒకే రోజు రెండు కీలక ప్రక్రియలు నిర్వహించడం యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం స్పష్టంగా ఉండటంతో, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పరిషత్ ఎన్నికల పోలింగ్ మార్చడంపై పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక నిర్ణయం త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# స్థానిక ఎన్నికల్లో దాడులు, అప్రజాస్వామిక విధానాలపై తీవ్ర నిరసనలు.. ప్రజలన్నీ గమనిస్తున్నారు!

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

నామినేషన్ల అడ్డుగింతులు మరియు దాడులు: రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వంలో అధికార కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర అడ్డంకులు సృష్టిస్తోందని, నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు పాల్పడుతోందని ప్రజలు, విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల తీర్పుపై నమ్మకం: ఎవరిని గెలిపించాలి, ఎవరిని ఓడించాలి అనేది ఓటర్లైన ప్రజలకు బాగా తెలుసని, దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను అపహాస్యం చేయడం తగదని మండిపడుతున్నారు.

ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు: కష్టకాలంలో ప్రజలను పట్టించుకోని పాలకులు, ఎన్నికల సమయంలో మాత్రం పోలీసులను అడ్డంపెట్టుకుని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజల ఆగ్రహాన్ని, ఓటు హక్కు శక్తిని ఎవరూ ఆపలేరని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని స్పష్టం చేస్తున్నారు.




# స్థానిక పోరులో రసవత్తర రాజకీయం.. నర్సీపట్నంలో తోటికోడళ్ల మధ్యే హోరాహోరీ పోరు!



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

నర్సీపట్నం మునిసిపాలిటీలో ఊహించని పరిణామాలు: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నికల బరి రాజకీయ వర్గాల్లో అత్యంత ఉత్కంఠను రేపుతోంది. సాధారణ ఎన్నికలను తలపించేలా ఈ స్థానిక పోరులో ఊహించని రాజకీయ సమీకరణాలు తెరపైకి వచ్చాయి.

**ప్రముఖుల కుటుంబాల మధ్యే ప్రత్యక్ష సమరం:** అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి కూటమి తరపున అధికారిక అభ్యర్థిగా బరిలో నిలవగా, సరిగ్గా అదే స్థానం కోసం ఆయన సోదరుడు చింతకాయల సన్యాసిపాత్రుడు సతీమణి అనిత వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి పోటీపడుతున్నారు.

గత అనుభవం వర్సెస్ ప్రతిష్ఠాత్మక పోరు: గతంలో డీసీసీబీ చైర్‌పర్సన్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న అనిత, ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థిగా మారి తన తోటికోడలైన పద్మావతితో నేరుగా తలపడుతుండటం విశేషం.

రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన వైనం: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఇళ్ల వ్యక్తులు వేర్వేరు రాజకీయ పార్టీల తరపున కీలకమైన చైర్‌పర్సన్ పదవికి పోటీపడుతుండటంతో, ఈ ఎన్నిక స్థానికంగానే కాక రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# జోగి రమేష్ కోడలు మేఘన కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ప్రమాదానికి గురైన కారు: మాజీ మంత్రి జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి కృష్ణ ప్రయాణిస్తున్న కారును ఓ ట్రావెల్స్ బస్సు వెనుక నుండి ఢీకొట్టింది.

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన: ఈ ప్రమాదం అక్టోబర్ 15న జరగగా, తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. మాజీ మంత్రిపై అనుమానాలు మరియు ఫిర్యాదు: తమకు ప్రాణహాని ఉందని, ఈ ప్రమాదం వెనుక మాజీ మంత్రి జోగి రమేష్ హస్తం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు కృష్ణ ఈ నెల 16న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసుల దర్యాప్తు: బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు



నమోదు చేసి, ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తును ముమ్మరం చేశారు.

# తిరుమల లడ్డు ప్రసాద రాజకీయాలపై కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం: చంద్రబాబు, పవన్ సర్కార్‌ల వైఖరిపై తీవ్ర నిరసన!

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

**వివరణాత్మక వార్తా విశేషాలు:**

వంద కోట్లకు పైగా ఉన్న భారతదేశ హిందూ ప్రజల ఆరాధ్య దైవమైన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి పవిత్రమైన లడ్డు ప్రసాదం వివాదాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులు రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా, వైయస్ జగన్ మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని శ్రీవారి లడ్డుపై చేసిన అసత్య ప్రచారాలు, రాజకీయ రచ్చపై భక్తులు మరియు ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా మార ప్రభుత్వ తీరు:

లడ్డు కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ జరిపి, దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని, భక్తుల మనోభావాలతో చెలగాటమాడవద్దని ప్రభుత్వానికి స్పష్టమైన మొట్టికాయలు వేసింది. అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించినప్పటికీ, కూటమి ప్రభుత్వ నేతల తీరులో ఎలాంటి మార్పు రాలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పవిత్రతను సైతం బలిపెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఏ వ్యక్తిపై అయినా తప్పు ఉంటే నిరూపించడానికి చట్టపరంగా సుప్రీంకోర్టుతో సహా అనేక వ్యవస్థలు ఉన్నప్పటికీ,






వాటిని పక్కనపెట్టి దేవుడి పేరుతో రచ్చ చేయడం ఏమాత్రం సమంజసం కాదని నిపుణులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**చరిత్రను మరిచిపోయిన చంద్రబాబు:**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుపతిలో జరిగిన తీవ్రమైన ప్రమాదం నుంచి సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామివారే స్వయంగా ప్రాణభిక్ష పెట్టి కాపాడారని, అలాంటి మహా కృతజ్ఞతను కూడా చంద్రబాబు నాయుడు విస్మరించారని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామివారే స్వయంగా ప్రాణాలు కాపాడినప్పటికీ, ఇతరులపై రాజకీయ కక్షలతో నేడు అదే దేవుడి లడ్డు ప్రసాదంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తూ భక్తుల నమ్మకాలను దెబ్బతీస్తున్న తీరు అత్యంత హేయమైనదని విమర్శలు వస్తున్నాయి.

**ప్రజల సహనాన్ని పరీక్షించకండి:**

రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, ప్రజలపై దాడులు జరుగుతున్నా, వాటిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పాలకుల తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, ప్రజల మనోభావాలను గౌరవించకుండా, కేవలం రాజకీయ స్వార్థం కోసం దేవుడిని అడ్డంపెట్టుకుని రాజకీయం చేయడం వల్ల ప్రజలు తీవ్రంగా నొచ్చుకున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలే స్వయంగా రోడ్డెక్కి పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ఓర్పుతో భరిస్తున్న ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే, భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి, నాయకులకు ఎప్పటికీ కోలుకోలేని విధంగా తగిన బుద్ధి చెబుతారని, ఇది ముమ్మాటికీ ఈ ప్రభుత్వానికి చివరి ఛాన్స్ అని రాష్ట్ర ప్రజలు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుకి గానీ, ఆయన కొడుక్కు గానీ, అలాగే పవన్ కళ్యాణ్‌కి గానీ రాజకీయంగా ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారం దక్కదని, ప్రజలే స్వయంగా తిరగబడి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరికలు గట్టిగా వినిపిస్తున్నాయి.

# వీటిని అసలు ఎన్నికలంటారా?: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది - వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న చంద్రబాబు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తూ ఖూనీ చేస్తున్నారని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రంలో కొనసాగుతున్న జంగిల్ రాజ్: ఏపీలో ప్రస్తుతం రూల్ ఆఫ్ లా పోయి, కేవలం 'జంగిల్ రాజ్' మాత్రమే నడుస్తోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వ తీరు ఏ విధంగా ఉందనేది స్పష్టమవుతోందని పేర్కొన్నారు.



నామినేషన్ల ప్రక్రియలో భారీ అక్రమాలు: నామినేషన్ల పర్వంలో అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై ఎన్ని ఆధారాలతో సహా చూపినప్పటికీ, ప్రభుత్వం మరియు ఎన్నికల కమిషన్ పట్టించుకోకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు.పోలీసు వ్యవస్థ తీరుపై తీవ్ర విమర్శలు: నిబంధనల ప్రకారం పనిచేయాల్సిన పోలీసు వ్యవస్థ సైతం పూర్తిగా అధికార పార్టీకి మోకరిల్లి, వారికి కొమ్ముకాయడం దారుణమని వైఎస్ జగన్ ఆరోపించారు.

ఎన్నికల విధానంపై నిలదీత: ప్రతిపక్షాలను అణచివేస్తూ సాగే ఇటువంటి తంతును అసలు ఎన్నికలంటారా?.. ఇలాంటి భయానక వాతావరణంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు ఎలా జరుగుతాయని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు.

# "మురిసిన పూలవణం" గోదావరిలో సేదతీరి నా బతుకమ్మ ఆనందోత్సవాల మధ్య రాయికల్ మండలంలో సంబరాలు

**రాయికల్ ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

జగిత్యాలజిల్లారాయికల్‌మండలం 22 గ్రామాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు జరిగాయిఅల్లీపూర్, కృష్ణంపేట్,అయోధ్య,రామజిపేట్,మైతాపూర్, ఆలూరు, కొత్తపేట, చింతలూరు, భూపతిపూర్,, వస్తాపూర్,రాజ్‌నగర్,కాట్కాపూర్, వద్దలింగాపూర్, చెర్ల కొండాపూర్ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలుఅంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగాయి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిగాపిలిచే బతుకమ్మ పండుగ పురస్కరించుకొని గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది ఆడపడుచులు పెద్ద ఎత్తున పాల్గొని ఆటపాటల తో సందడి చేశారు పిల్లలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పెర్చి పూజించిన మహిళలు చివరిరోజైనా సద్దుల బతుకమ్మ సందర్భంగా గును గు,తంగేడు, బంతి,చామంతి రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను చేత పూని గ్రామాల్లోని చెరువులు వాగుల వద్ద చేరుకొని కొత్తబట్టలు ధరించి సంప్రదాయ అలంకరణలతో తరలివచ్చిన మహిళలతో పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి పూలతో పేర్చే బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణలుగా మెరిచాయి చెరువులు వాగుల పరిసరాల్లో మహిళలు వలయాకారంలో నిలబడి బతుకమ్మ పాటలు పాడుతూ చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడి పాడారు "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో "అంటూ









దైవదంగా పాట పాడుతు చేసే నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి చిన్నారుల నుంచి లయబద్ధంగా పాటలు పాడుతూ చేసే నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ పాటలు పల్లె వాతావరణం చేసి సద్దులు మరొకరు పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు పెద్దల వద్ద ఆశీర్వాదాలు తీసుకుంటూ అప్యాయతలు పంచుకున్నారు పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలకు సారే పెట్టి అత్తవారిని సాగానంపారు ఈ వేడుకల గ్రామ సర్పంచ్లు వార్డ్ సభ్యులు మహిళా సంఘాల సభ్యులు యువకులు గ్రామస్తులు పెద్ద సంకల్పం తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతిగా ముఖ్య సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి

# అంక్సాపూర్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వేల్పూర్ మండలం ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని బతుకమ్మనుపేర్చడానికి తంగేడు పువ్వులు,గానుగ బంతి,చామంతి,వివిధ రకాల పూలతో ఆలయ గోపురం ఆకారంలో అందంగా అమర్చా బతుకమ్మలను ఒక్కచోట చేర్చి ఆడపడుచులు అంతా చుట్టూ చేరి ఆటపాటలతో చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు.ప్రకృతిలో మమేకమై తాము పడ్డ



బాధలను కష్టాలను మరిచిపోతారు.బతుకమ్మ అనగానే ఒక సంబరం ఒక సాంస్కృతి వారసత్వం ఒక ఆధ్యాత్మికత ఉత్సవం. అని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిట్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ నేరెళ్ల చిన్న రాజేశ్వర్,వార్డు సభ్యులు బుట్టి మధు ఆర్మూర్ మోహన్, బబ్బూరి శ్రీను, బుట్టి మహిపాల్,తిట్ల విజయ్,తిట్ల సంతోష్,బుట్టి మౌనిక,చెలిమెల భూవన, తిట్ల హరిప్రియ,మచ్చు నర్సుబాయ్,బుట్టి నర్సు, కారబర్ చిట్టిబాబు,గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మనిషికి సోకిన షమోండా వైరస్.. ఫ్రాన్స్‌లో ప్రపంచంలోనే తొలి కేసు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
ఫ్రాన్స్‌లో అరుదైన వైరస్ వెలుగుచూపు: ఫ్రాన్స్‌లోని లియోన్ నగరంలో ఒక 60 ఏళ్ల వ్యక్తికి 'షమోండా' వైరస్ సోకినట్లు అధికారులు గుర్తించారు. ప్రపంచంలోనే మనిషికి ఈ వైరస్ సోకడం ఇదే తొలి కేసు కావడం గమనార్హం.
వ్యాధిగ్రస్తుడి మృతి: ఇది అత్యంత అరుదైన కేసు అని, అప్పటికే అనారోగ్యంతో ఉన్న ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మరణించారని అధికారులు పేర్కొన్నారు.
కీటకం కాటు ద్వారా సంక్రమణ: తూర్పు ఫ్రాన్స్‌లో 'క్యులికాయిడ్స్' కీటకం కాటు ద్వారా సదరు వ్యక్తికి ఈ వైరస్ సోకి ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టత: అయితే, ఈ వైరస్ పశువుల నుండి నేరుగా మనుషులకు వ్యాపిస్తుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని, కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు ఫ్రాన్స్ ఆరోగ్య శాఖ స్పష్టం చేశాయి.

## నామినేషన్ల రోజున 31 చోట్ల హింస.. 54 మందిపై కేసులు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
నామినేషన్ల పర్వంలో ఉద్రిక్తతలు: ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల సందర్భం గురువారం రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో మొత్తం 31 చోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయి.

భారీగా ఘర్షణలు మరియు దాడులు: ఈ ఘర్షణల్లో భాగంగా రాళ్లు, కర్రలతో దాడులు చేసుకోవడం, నామినేషన్ పత్రాలను బలవంతంగాలాక్కోవడంవంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.
వాహనాలకు నిప్పు మరియు ఆందోళనలు: వాహనాలకు నిప్పు పెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం, గాల్లోకి కాల్పులు జరపడం మరియు రాస్తారోకోలు వంటి అశాంతియుత పరిస్థితులు తలెత్తాయి. గాయపడిన వారు మరియు పోలీసుల కేసులు: ఈ గొడవల్లో ఒకకానిస్టేబుల్‌తో పాటు మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్పందించిన పోలీసులు 16 కేసులు నమోదు చేసి, మొత్తం 54 మందిని నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## వైసీపీ మహిళా అభ్యర్థులపై టీడీపీ నేతల దాడి – తీవ్ర కలకలం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
వైసీపీ అభ్యర్థులపై భౌతిక దాడి: చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరులో వైఎస్సార్‌సీపీ మహిళా అభ్యర్థులపై టీడీపీ నాయకులు మరియు తమిళనాడు నుంచి వచ్చిన బయటి వ్యక్తులు దాడికి పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి.
నామినేషన్ల సమయంలో దౌర్జన్యం: బాలగంగానపల్లికి చెందిన మోహన, వింజంకు చెందిన నాగరత్నమ్మ తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న సమక్షంలో, దుండగులు వారిపై దాడి చేసి పత్రాలను బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించారు. దుస్తులు తొలగించి తనిఖీ చేసినట్లు ఆరోపణలు: నగరిలో రవికుమార్, గురుమూర్తిల దుస్తులు తొలగించి మరీ తనిఖీ చేసినట్లు సమాచారం బయటకు వచ్చింది. పోలీసుల సమక్షంలోనే ఘటనలు: ఈ దారుణ ఘటనలన్నీ ఏకంగా పోలీసుల సమక్షంలోనే జరిగాయని



బాధితులు, అభ్యర్థులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల లోపంపై ఈ ఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది.

## ఇంకొల్లు కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థిగా కొల్లూరి శ్రీకాంత్



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక: ఇంకొల్లు మండల కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా ఇంకొల్లు గ్రామానికి చెందిన కొల్లూరి శ్రీకాంత్‌ను పార్టీ అధిష్టానం అధికారికంగా ఎంపిక చేసింది. బీఫారం అందజేత: కాంగ్రెస్ మాజీ మంత్రి, ప్రముఖ నాయకులు జేడీ సీలం చేతుల మీదుగా శ్రీకాంత్‌కు పార్టీ బీఫారం అందజేయబడింది. నామినేషన్ దాఖలుకు బాపట్లకు పయనం: అధిష్టానం నిర్ణయంతో కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీకాంత్ నామినేషన్ వేయడానికి బాపట్లకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజాంపట్నం ఎంపీపీ అభ్యర్థిగా మోపిదేవి వెంకటరమణ కుమారుడు నామినేషన్

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
ఘనంగా నామినేషన్ దాఖలు: బాపట్ల జిల్లా నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో, నిజాంపట్నం ఎంపీపీ అభ్యర్థిగా మోపిదేవి రాజీవ్ తన నామినేషన్‌ను అత్యంత ఘనంగా మరియు అధికారికంగా దాఖలు చేశారు.
**పాల్గొన్న ప్రముఖ నాయకులు:** మాజీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ కుమారుడైన రాజీవ్ నామినేషన్ పత్రాలు సమర్పించే కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితర ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. మద్దతు ప్రకటన: అభ్యర్థికి తమ పూర్తి మద్దతును తెలుపుతూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ



కార్యక్రమం స్థానికంగా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## చెర్ల కొండాపూర్ లో ఘనంగా జరిగిన బతుకమ్మ సంబరాలు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
బతుకమ్మ బతుకమ్మ నా బంగారు బతుకమ్మ అంటూ తొమ్మిది రోజులు పువ్వులకు పూజలు చేసి ఈరోజు పూలను నిమజ్జనం చేస్తూ "ఈవోద్దు నుండి అ ఒడ్డుకు పోవాలని మళ్లీ వస్తాము" అమ్మా అని పాటలతో డిజె సౌండ్ లతో ఎంతో ఆనంద ఉత్సవాల మధ్య గ్రామంలో ప్రధాన కూడలి ద్వారా పాటలు పాడుకుంటూ చెరువు దగ్గరి బతుకమ్మ గాట్ వద్ద నిమజ్జనంతో మళ్ళీ వస్తావమ్మా మల్లి సంవత్సరానికి వస్తాం అమ్మ అని వీడ్కోలు పలుకుతూ ఎవరింటికి వారు వెళ్లడం ఒక





అణవాయితీ!! జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చెర్ల కొండాపూర్ గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నా ఈ కార్యక్రమం విజయవంతమైశీదాని గ్రామ సర్పంచ్ దేవుని రవి ఉపసర్పంచ్ అర్మూర్ లక్ష్మీనారయణ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దల సహకారంతో విజయవంతమైందని ఈ సందర్భంగా మహిళలకు మరోసారి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు

## అట్టహాసంగా మొలగవల్లి 1,2వ ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేసిన టిడిపి అభ్యర్థులు.

**( కర్నూలు జిల్లా ఇంచార్జ్ ) ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆలూరు మండలం పరిధిలోని మొలగవల్లి గ్రామంలో రాజకీయ సందడి నెలకొన్నది. మొలగవల్లి 1వ, 2వ ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్, ఎంపీపీ అభ్యర్థి వైకుంఠం సాయి శ్రీరామ్, ఆశీస్సులతో మండల కన్వీనర్ కటారి కొండ శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు అశోక్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఈ రప్ప, గ్రామ టిడిపి నాయకులు మోకా మల్లయ్య, డీలర్ వెంకటేశ్వర్లు, లాయర్ ప్రవీణ్ కుమార్, డీలర్ అంజినయ్య, బెలగంటి కురువ హనుమప్ప, క్లస్టర్ కో కన్వీనర్ సోమశేఖర్, మాల్పు రామకృష్ణ,యూనిట్ కన్వీనర్ షేక్షావలి, నెట్టప్ప, మాల నరసింహులు తదితరుల సహాయ సహకారాలతో ఆలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీతో బయలుదేరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం చేరుకొని తమ నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం లక్ష్యంగా పార్టీ



నాయకులు కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు తెలియజేశారు. ప్రతి ఒక్క టీడీపీ నాయకుడు ఒక సైనికుడు మాదిరిగా మన గ్రామ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు మన గ్రామము నుండి రెండు ఎంపీటీసీలను గెలిపించి మన ఇన్చార్జి తనయుడు వైకుంఠం సాయి శ్రీ రాములు ను ఎంపీపీగా గెలిపించుకొని మండలాభివృద్ధిగ్రామఅభివృద్ధిలో చేసుకుందామని మొలగవల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సమావేశమై గెలుపు కోసం కృషి చేస్తామని తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేశారు. నామినేషన్ల కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకుడికి కార్యకర్తలకు ఎంపిటిసి అభ్యర్థులు శ్రీమతి మాల్పు జ్యోతి రామకృష్ణ యాదవ్, చిలక మాణిక్య యాదవ్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా శిరస్సు వంచి చేతులు జోడించినమస్కరిస్తూ మా విజయానికి కృషి చేయాలని విన్నవించారు.

## అంక్సాపూర్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వేల్పూర్ మండలం ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని బతుకమ్మను పేర్చడానికి తంగేడు పువ్వులు,గానుగు బంతి,చామంతి,వివిధ రకాల పూలతో ఆలయ గోపురం ఆకారంలో అందంగా అమర్చా బతుకమ్మలను ఒక్కచోట చేర్చి ఆడపడుచులు అంతా చుట్టూ చేరి ఆటపాటలతో చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు.ప్రకృతిలో మమేకమై తాము పడ్డ బాధలను కష్టాలను మరిచిపోతారు.బతుకమ్మ అనగానే ఒక సంబరం



ఒక సాంస్కృతి వారసత్వం ఒక ఆధ్యాత్మికత ఉత్సవం. అని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిట్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ నేరెళ్ల చిన్న రాజేశ్వర్,వార్డు సభ్యులు బుట్టి మధు ఆర్మూర్ మోహన్, బబ్బూరి శ్రీను, బుట్టి మహిపాల్,తిట్ల



విజయ్,తిట్ల సంతోష్,బుట్టి మౌనిక,చెలిమెల భూవన, తిట్ల హరిప్రియ,మచ్చు నర్సుబాయ్,బుట్టి నర్సు, కారబర్ చిట్టిబాబు,గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ కు చెందిన నరేష్‌ను పరామర్శ.. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
జగిత్యాల పట్టణంలోని కేవీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నలువాల నరేష్‌ను మాజీ



మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించారు. నరేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.నరేష్‌కు మెరుగైన వైద్య చికిత్స అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్య ఖర్చుల నిమిత్తం నరేష్‌కు ఆర్థిక సహాయం అందించారు. జీవన్ రెడ్డి వారి వెంట. మాజీ జడ్పీ వైస్ చేర్మెన్ హరి చరణ్ రావు , నరేష్ గౌడ్, సర్పంచ్ స్వామిరెడ్డి, మహేష్, శ్రీరాముల గంగాధర్, కొక్కుల గంగాధర్, కాటిపల్లి రాజశేఖర్ రెడ్డి, వంశీ, దరి, చంద్రయ్య, రాజశేఖర్, గణేష్,సుమన్లు వున్నారు

## సందీప్ కు నివాళులర్పించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి.పాడె మోసిన సమ్మిగౌడ్

**మహబూబాబాద్ జిల్లా ( ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
మండల పరిధిలోని అర్పణపల్లి గ్రామానికి చెందిన సందీప్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడుకక్కడే మృతి చెందగా,సందీప్ భార్య భవాని పరిస్థితి విషమంగా ఉంది.ఖమ్మం హాస్పిటల్ లో చావు బ్రతుకుల మధ్య కొట్లాడుతుంది.సందీప్ మరణం తో గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది.?శుక్రవారం నాడు మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి సందీప్ నివాసానికిచేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సందీప్ అంత్యక్రియలు నిర్వహించగా... మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ హాజరై పాడె మోశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతినితెలిపిఅంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఉండి సందీప్ కుటుంబానికి ధైర్యం చెప్పారు .ఈ



సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సందీప్‌కు వివాహమై కేవలం రెండు నెలలే అవుతోందని, దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఉప్పరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సందీప్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సందీప్ తక్కువ సమయం లో అందరి దగ్గర మంచి మన్ననలు పొందాడని,తన మరణం మాకు ఎంతోకలంగా కలిసి ఉన్న ఆప్తుడిని కోల్పోయినట్టు ఉందని,పండుగ రోజు మమ్మల్ని



కన్నీటి శోకం లో పడేసినట్టు అయ్యిందని విచారణ వ్యక్తం చేశారు ..సందీప్ కుటుంబానికి కాంగ్రెస్ మండల పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి,మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ బండారు వెంకన్న, సర్పంచ్ కుమారస్వామి,చిన్న వెంకన్న, వల్లందాసు రవి, తరాల వీరేష్, కమకుటం శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్,తండ సంపత్,బిర్రు వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్య డయాలసిస్ తో బాధపడుతున్న బండ నారాయణ కు ఆర్థిక సహాయం.

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
వెలికట్ట గ్రామంలో హరిజన కాలనీకి చెందిన బండ నారాయణ గత కొద్ది రోజులుగా రెండు కిడ్నీలు డ్యామేజ్ అవడంతో విషయం తెలుసుకున్న మాలోత్ సునీత -రాజేందర్ నారాయణకు డయాలసిస్ ఖర్చులకు వారి కుటుంబానికి రూ.10000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ ఆదేశాల మేరకు అందజేత అందజేయడం జరిగింది అదేవిధంగా



వెలికట్ట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలని ప్రమర్శించి ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాలోత్ సునీత రాజేందర్ బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈసందర్భంగాబాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, కష్టకాలంలో వారికి తోడుగా నిలవడం తమ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ అల్లంనేని అనిల్ రావు, వార్డు సభ్యులు వీరమనేని రమేష్ రావు, సోమరపు ఐలయ్య, భోగ కమలాకర్, బంధు వెంకన్న, మాలోత్ యాకుబ్,రవి,రాములు,యాకయ్య, వడ్లకొండ వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలకు తాగునీరు, రైతులకు ఉపాధి కల్పిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గి, సాగు, తాగునీటి లభ్యత క్షీణించే ప్రమాదం ఉందని, ప్రజలు, అధికారులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కరువు ప్రభావం ప్రారంభంలో పెద్దగా కనిపించకపోయినా, క్రమంగా తీవ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే జూలై వరకు తాగునీటి సమస్యలు కొనసాగే అవకాశం ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులపై ప్రతిరోజూ బులెటిన్ విడుదల చేస్తామని, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రోజువారీ సమాచారాన్ని అందిస్తారని తెలిపారు.



ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వ్యవసాయం, పశుసంపద పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు.

**కరువు ప్రభావం నెమ్మదిగా పెరుగుతుంది**

వరదలు, కరువు, భూకంపాలను ప్రధాన ప్రకృతి వైపరీత్యాలుగా పేర్కొన్న ముఖ్యమంత్రి.. భూకంపాలు, వరదలు వంటి విపత్తులు తక్కువ సమయంలోనే తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, కరువు మాత్రం నెమ్మదిగా ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తుందని వివరించారు. కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం అత్యంత కీలకమన్నారు.

ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇంగ్లాండ్, అమెరికా, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లోనూ నీటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో నీటి రేషన్ విధానం అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలోనూ తాగునీటి కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని, సమస్యలను దాచిపెట్టకూడదని అధికారులకు సూచించారు.

కరువు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందంటూ విమర్శలు చేస్తున్నారని ప్రస్తావిస్తూ, ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతాయని సీఎం పేర్కొన్నారు. మూడు నెలల క్రితం ఎల్‌నినో గురించి ప్రభుత్వం మాట్లాడినప్పుడు చాలామందికి దాని తీవ్రత అర్థం కాలేదని, ఇప్పుడు నీరు, విద్యుత్ కోసం ప్రజాప్రతినిధులు కోరుతున్నారని అన్నారు.

**తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, ఆ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ప్రజలకు ముందుగానే పరిస్థితిని వివరించి, నీటిని పొదుపుగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడవచ్చని, వడదెబ్బ కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ కొరత.. పొదుపే కీలకం

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న స్థాయిని మించిపోయిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అప్పులు తెచ్చి విద్యుత్ కొనుగోలు చేస్తూ సరఫరా చేస్తోందని తెలిపారు. యూనిట్‌కు రూ.15 చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో అవసరమైన విద్యుత్ అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు పాటించాలని, ప్రజలు కూడా అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికి సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల కుటుంబాల విద్యుత్ అవసరాలు తీరడంతోపాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నారని సీఎం వివరించారు. ఇలాంటి విధానాలను విస్తృతం చేయడం ద్వారా విద్యుత్ అవసరాలను కొంతవరకు తీర్చుకోవచ్చని పేర్కొన్నారు.

**యాదాద్రి పవర్ ప్లాంట్‌పై గత ప్రభుత్వానికి బాధ్యత**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. బొగ్గు అందుబాటులో లేని దామరచర్లలో ప్లాంట్ నిర్మించడం వల్ల ఏటా సుమారు రూ.2 వేల కోట్ల బొగ్గు రవాణా భారం పడుతోందని ఆరోపించారు. సింగరేణిలో లభించని జీ–9 బొగ్గును ఉపయోగించేలా విద్యుత్ ఉత్పత్తి యంత్రాలను ఏర్పాటు చేయడం వెనుక విదేశాల నుంచి బొగ్గు దిగుమతి



చేసుకోవాలనే ఉద్దేశం ఉందని విమర్శించారు. నాలుగేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టును పదేళ్లయినా పూర్తి చేయలేకపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను అధిగమించి ప్లాంట్‌ను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. సింగరేణి, కోల్ ఇండియా, నైనీ ప్రాంతాల్లోనూ జీ–9 బొగ్గు అందుబాటులో లేదని, ప్రస్తుతం జీ–12, జీ–13 రకాల బొగ్గుతో యాదాద్రి ప్లాంట్‌ను నడుపుతున్నామని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం, బొగ్గు కొనుగోలు వ్యవహారాలపై గత ప్రభుత్వంపై భారీ ఆర్థిక అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు చేశారు. ప్రతిమా శ్రీనివాస్‌కు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని విమర్శించారు. అలాగే కేసీఆర్ కుటుంబ సభ్యులపై వివిధ వ్యాపారాలు, వనరుల వినియోగానికి సంబంధించి తీవ్ర ఆరోపణలు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తే, అవి ఒక కుటుంబానికే పరిమితమయ్యాయని విమర్శించారు. కరువు పరిస్థితుల్లో భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ హయాంలో ప్రారంభమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చినా దాని ప్రాథమిక లక్ష్యం ఉపాధి కల్పించడమేనని అన్నారు.

సంక్రాంతి నుంచి మే నెల వరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉంటూ సమస్యలను పరిశీలిస్తున్నారా లేదా అన్నది పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగిస్తున్నామని, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారులు నిర్మించాలని, చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించాలని సూచించారు. ప్రతి చేతికి పని కల్పించడం, ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించడం, ప్రజలకు కడుపునిండా భోజనం అందేలా చూడటం ప్రభుత్వ కార్యాచరణలో భాగమని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటలు వేసి పెట్టుబడులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం సూచించారు. విద్యుత్ సరఫరా చేసినప్పటికీ భూగర్భ జలాలు లేకపోతే పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. అవసరమైతే పంటలు వేయని కుటుంబాలకు కూడా ఉపాధి హామీ ద్వారా పని కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**పశుసంపద పరిరక్షణకు చర్యలు**

కరువు ప్రభావం పశుసంపదపై పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం, నీటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతు వేదికల్లో వారానికోసారి రైతులకు అవగాహన కల్పిస్తున్నందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభినందించారు. ఎల్‌నినో ప్రభావం, తాగునీటి లభ్యత, విద్యుత్ పరిస్థితులు, వ్యవసాయంపై ప్రతిరోజూ ప్రజలకు సమాచారం అందించడం ద్వారా అపోహలను తొలగించాలని సీఎం పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.

సమస్యలు తలెత్తినప్పుడే నాయకత్వ సామర్థ్యం బయటపడుతుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడం, తాగునీరు అందించడం, విద్యుత్ పొదుపును ప్రోత్సహించడం, రైతులు పెట్టుబడులు నష్టపోకుండా చూడటం, ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి పని కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాలని స్పష్టం చేశారు.

**ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధి**

సంక్రాంతి నుంచి మే వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పిస్తామని సీఎం తెలిపారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో వ్యవసాయ రహదారులు, చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించాలని సూచించారు. చేతినిండా పని.. కడుపునిండా భోజనం తమ కార్యాచరణ అని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి**

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 36 శాతం ఓటర్లే నమోదు అయ్యారని, మిగిలిన అర్హులైన పట్టభద్రులను కూడా నమోదు చేయించాలని సీఎం సూచించారు. సామా రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అభ్యర్థులకు మాత్రమే కాకుండా పార్టీకి కూడా ప్రతిష్ఠాత్మకమని పేర్కొన్నారు.

## సుందరగిరిలో రోడ్డు ప్రమాదం.. గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. దేవాలయం ముందు పని ముగించుకుని మెడికల్ షాపులో మందులు తీసుకుని ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని టూవీలర్ వాహనం ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు.

బాధితుడిని సుందరగిరి గ్రామానికి చెందిన ఎలగందుల ఎల్లయ్య (70) గా గుర్తించారు. ఎల్లయ్య ,దేవాలయం పని ముగించుకుని మందులు తీసుకుని నడుచుకుంటూ వస్తుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

ఈ ప్రమాదంలో ఎల్లయ్య తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం వాహనదారుడు అక్కడి నుండి పరారయ్యాడు.

స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రసూనాంబను కలిసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ

**జగిత్యాల జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**



జగిత్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ నిర్వహణ కమిటీ సభ్యులు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి ఎన్. ప్రసూనాంబ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ సభ్యులకు ఎన్. ప్రసూనాంబ అభినందనలు తెలియజేశారు. సమాజ సేవ, మానవతా విలువల పరిరక్షణ, విపత్కర పరిస్థితుల్లో బాధితులకు సహాయ సహకారాలు అందించడం, పేదలు మరియు నిరుపేదలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడం వంటి రంగాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. జగిత్యాల జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## నామినేషన్ దాఖలు.





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

పెనమలూరు గ్రామంలో పెనమలూరు మండలం గోసాల 2అభ్యర్థి తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపికూటమి అభ్యర్థి నామినేషన్ అభ్యర్థి కోన మనోజ నామినేషన్ పత్రాలుఅందజేశారు కార్యక్రమంలో మారుపూడి ధన కోటేశ్వరావు కోయ ఆనంద ప్రసాద్ మాబు సుభాని కోనేరు వెంకటేశ్వరరావు కోనేరు సాంబశివరావు పాల్గొన్నాడు

## స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి: జిల్లా కలెక్టర్

**- రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.**

**- భద్రత, బారికేడింగ్, సీసీ కెమెరాలు, విద్యుత్ సదుపాయాలు, సిబ్బంది రాకపోకలకు ప్రత్యేక మార్గాలపై అధికారులకు సూచనలు**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.

దీనిలో భాగంగా జగ్గయ్యపేట ఎస్.జి.ఎస్ కళాశాల యూజీసీ బ్లాక్, కంచికచర్ల, మార్కెట్ యార్డ్, కొండపల్లి జెడ్పీ పాఠశాల తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా సంబంధిత భవన సముదాయాలు, వాటి ప్రాంగణాలు, కౌంటింగ్ హాళ్లు, గదుల్లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.

కౌంటింగ్ లేదా స్ట్రాంగ్ రూములుగా వినియోగించనున్న గదుల్లో నేలపై ఏర్పాటు చేసిన నంబర్డ్ గ్రిడ్లు, మార్కింగ్‌లను పరిశీలించి, కౌంటింగ్ ప్రక్రియకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా తగిన సూచనలు చేశారు.

భవన ప్రాంగణంలో బారికేడింగ్, టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన స్థలం, రాకపోకలకు అనువైన మార్గాలపై అధికారులతో చర్చించారు.

కౌంటింగ్ హాళ్లలో ఒక్కో విభాగం, వరుసకు అవసరమైన టేబుళ్ల సంఖ్య, టేబుళ్ల మధ్య ఉండాల్సిన దూరం, అధికారులు, సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేందుకు అవసరమైన మార్గాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ క్రమంలో అధికారులు సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాప్‌లు, నివేదిక పత్రాలను పరిశీలిస్తూ గదుల కొలతలు, ప్రవేశ ద్వారాలు, నిష్క్రమణ ద్వారాలు, భద్రతాపరమైన అంశాలను అంచనా వేశారు.

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.

పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు ఉన్న ప్రాంగణాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ముఖ్యంగా ప్రాంగణాల్లో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

అవసరమైన ఇతర సౌకర్యాలను ముందుగానే గుర్తించి, వాటి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

స్ట్రాంగ్ రూముల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

స్ట్రాంగ్ రూమ్ ప్రవేశ ద్వారం స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

భద్రతాపరమైన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

అలాగే భవనాల చుట్టూ, కౌంటింగ్ కేంద్రాల లోపల బారికేడింగ్, ఫెన్సింగ్ ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

సంబంధిత ప్రాంతాల్లో భద్రతా నియంత్రణకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించే కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల కోసం వేర్వేరు ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రాకపోకల సమయంలో రద్దీ ఏర్పడకుండా, విధుల నిర్వహణకు ఆటంకం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, భద్రత, మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ హాళ్ల లేఅవుట్ వంటి అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సందర్భంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, జగ్గయ్యపేట తహసిల్దార్ ఎస్.శిరీష, మున్సిపల్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఎంపీడీవో అరుణ, కంచికచర్ల తహసిల్దార్ నరసింహారావు, ఇబ్రహీంపట్నం తహసిల్దార్ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీచేయడమైనది.

## కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాపు జేఏసీ విజ్ఞప్తి

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని తెలగ, వంటరి, బలిజ, కాపు జేఏసీ రాష్ట్ర నేతలు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కాపు సామాజిక వర్గంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు మేలు చేస్తుందని వారు చెప్పారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో కాపు జేఏసీ నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్ తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీల



అభ్యర్థులకు ఓటు వేయాలని కాపు సామాజిక వర్గాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో అరాచక ప్రభుత్వానికి గద్దెదించి కూటమి పార్టీలకు ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని తాము రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేసి ప్రచారం చేసిన సంగతిని వారు గుర్తు చేశారు. 100శాతం కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలన్నీ గెలుచుకుంటుందని వారు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఈ నారాయణ మున్సిపల్ మంత్రిగా ఎంతో చాకచక్యంతో ఈ వ్యవస్థలను నిర్వర్తించి ప్రజా మన్ననలను పొందుతున్నారన్నారు. తను సామాజిక వర్గ సమస్యలను, హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలు విజయం సాధించాలని కోరుతూ పర్యటన చేస్తామని దాసు, ప్రకాష్, రామకృష్ణలు తెలిపారు

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శనివారం , అక్టోబర్,24, 2026 www.trinetnews.com

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

## నాగారంలో సెర్నిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో పోలీసుల అవగాహన ర్యాలీ



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని అక్టోబర్ 23న నాగారంలోని సెర్నిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కీసర సీఐ ఎలక్షన్ రెడ్డి, నాగారం ఎస్ఐ నాయకత్వంలో పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ నాగారం ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది.

ఈ సందర్భంగా సీఐ ఎలక్షన్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో, దేశభక్తితో మెలగాలని సూచించారు. ర్యాలీలో విద్యార్థులు “పోలీస్ అమరవీరులకు జోహార్” అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెర్నిటీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం

## పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్న పొన్నం శ్రీనివాస్

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

చిగురుమామిడి:భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ నియమితులయ్యారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆశీస్సులతో,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కు పొన్నం శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకానికి సహకరించి,ప్రోత్సాహం అందించిన సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకన్న,కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రావు,హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి,మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ,జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సూచనలు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా



సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి,రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు.తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ,పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య ముగిసిన నామినేషన్ల ఘట్టం






**అన్నమయ్య జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. పుంగనూరులోని కొత్తఇండ్లు మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రం వద్ద డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ సూచనలతో మదనపల్లి డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. తొలిరోజు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో చివరి రోజు నామినేషన్ కేంద్రంలోకి వెళ్లే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం నామినేషన్ కేంద్రంలోనికి అనుమతించారు. అదేవిధంగాఅక్కడక్కడస్వల్పఘర్షణలు చోటుచేసుకోవడం తో డీఎస్పీ ప్రసాద్ సంఘటనా స్థలాలకు చేరుకుని పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారు, చివరి రోజైన శుక్రవారం మొత్తం 55 నామినేషన్లు దాఖలైనట్లు సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. వీటిలో తెలుగుదేశం పార్టీ నుంచి 35, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 12, జనసేన నుంచి 3, ఇతర పార్టీల నుంచి 5 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన వెల్లడించారు. మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు 12, రెండో రోజు 34, మూడో రోజు 55 చొప్పున మొత్తం 101 నామినేషన్లు దాఖలయ్యాయని సహాయ ఎన్నికల అధికారి అప్పాజీ తెలిపారు దీంతో పుంగనూరు మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ముగిసింది

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా

## ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ రోజు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ గారు విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారీ విధులు, వివిధ చట్టాలు, నేరాల దర్యాప్తులో ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు మరియు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసుల విధులు, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి తెలుసుకున్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించడం జరిగింది.

# కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

-ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
-కరవు ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ఠ చర్యలు
-తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు..
-ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన
-అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలను చైతన్యపరచాలి
-రైతులకు అండగా ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు అక్టోబర్ 31 తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్ నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిల పక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది.

రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్–నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్–కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ నినో , కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.?ఈ సమావేశానికి సబ్–కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, అర్హత కలిగిన మండలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. కరువు, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు

ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దటి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటిపారుదల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకొని, కరువు పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వాస్తవ పరిస్థితులపై రైతులు, సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పర్చాలని అన్నారు. మండలాల్లో భూ గర్భ జలాల మట్టం, వేసవి తీవ్రత తదితర అంశాలపై గణాంకాలను ప్రతీ వారం నివేదికలను జిల్లాల్లో విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవసరమైన సమాచారం చేరేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు, నీటి సంరక్షణ చర్యలు, వ్యవసాయ సలహాలు, అందుబాటులో ఉండే సహాయ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్–నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ల కు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ప్రస్తుత ఎల్–నినో, కరువు పరిస్థితులతో రాష్ట్రంలో దాదాపు రూ. 7,000 కోట్లతో కరువు పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీరు, రైతులకు అవసరమైన సహాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను సిద్ధం చేసి, దాని అమలుపై నిరంతరం దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, జిల్లాల్లో రోజు రోజుకు చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా చేపల మనుగడకు కష్టంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పెద్ద రిజర్వాయర్లలో చేపలను వదిలేందుకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. పశువులకు తాగునీటి తొట్టెలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రతీ జిల్లా కలెక్టర్ కు అత్యవసర నిధుల కింద ఒక కోటి రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. వర్షాపాతం తక్కువగా నమోదు, పంట విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండడం తదితర ప్రమాణాలను పరిగణనలో తీసుకొని 358 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించమని తెలిపారు. నియమిత గడువైన, ఈనెల 31 తేదీ లోగా కేంద్ర ప్రభుత్వానికి కరువు మండలాల జాబితా ను సమర్పిస్తామని తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ట వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని తెలిపారు. 324 మండలాల్లో భూగర్భ జలాల మట్టం ఆందోళనకర స్థాయిలో ఉందని వివరించారు. రాష్ట్రం లోని రిజర్వాయర్లలో మొత్తం 470 టీ.ఎం.సి లకు గాను ప్రస్తుతం 170 టి. ఎం.సి ల జలాలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయాన్ని తానూ స్వయంగా పరిశీలించామని, ఈ జలాశయంలో నీటి లేమితో ఏర్పడ్డ పరిస్థితులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామన్నారు.

# మాగనూర్ పెద్దవాగును మింగేస్తున్న ఇసుక మాఫియా...

## భూగర్భ జలాలు అడుగంటి 16 గ్రామాల రైతుల్లో ఆందోళన...





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

మాగనూర్ మండలం దాసరిదొడ్డి సమీపంలోని పెద్దవాగులో జరుగుతున్న అక్రమ ఇసుక దోపిడీపై బిజెపి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూగర్భ జలాలను కాపాడాలని, రైతుల పొట్ట కొట్టొద్దని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ కొండయ్య ఆధ్వర్యంలో బిజెపి బృందం పెద్దవాగును స్వయంగా పరిశీలించింది.

**ఒకప్పుడు బంగారం.. నేడు బీడు:**

ఒకప్పుడు ఈ వాగులో బంగారు వర్ణంలో దగదగా మెరిసే ఇసుక ఉండేదని, ఇప్పుడు ఇసుక మాఫియా పగలూ రాత్రి అనే తేడా లేకుండా జాతీయ రహదారి మీదుగానే లారీల కొద్దీ తరలిస్తుండటంతో ఇసుక పూర్తిగా కనుమరుగైపోయిందని నాయకులు తెలిపారు. వాగంతా మొరం, మట్టి తేలి, పిచ్చి మొక్కలతో నిండిపోయిందని, నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**16 గ్రామాల రైతులకు శాపం:**

ఈ పెద్దవాగుపైనే ఆధారపడి మాగనూర్ చుట్టుపక్కల 16 గ్రామాల రైతులు హ్యాండ్ బోర్లు, బావుల ద్వారా రెండు పంటలు పండించుకునే వారని, భూగర్భ జలాలకు ఈ వాగే ప్రధాన ఆధారమని కొండయ్య అన్నారు. కానీ అక్రమ తవ్వకాల వల్ల నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతిని, భూగర్భ జలమట్టం అడుగంటిపోయిందని, దీంతో రైతులు ఒక్క పంట కూడా పండించుకోలేని దుస్థితి నెలకొందని తెలిపారు.

**అధికారులపై తీవ్ర విమర్శలు:**

జాతీయ రహదారిపై బహిరంగంగా ఇసుక దోపిడీ జరుగుతున్నా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి పట్టించుకోవడం లేదని, కాంగ్రెస్ కు గులాం అయిన రెవెన్యూ, పోలీస్ అధికారులు కళ్ళుండి చూడలేని గుడ్డివారిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ చూసినా పట్టించుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

రైతులను బాధపెట్టిన ఏ ప్రభుత్వం గానీ, ప్రజా ప్రతినిధి గానీ, అధికారి గానీ చరిత్రలో బాగుపడ్డ దాఖలాలు లేవని, ఇప్పటికైనా మంత్రి, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కళ్ళు తెరిచి ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, దోపిడీదారులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

**పాల్గొన్న నాయకులు:**

ఈ పరిశీలన కార్యక్రమంలో బిజెపి ఓబీసీ అధికార ప్రతినిధి శంకరుల రవికుమార్, సీనియర్ నాయకులు కల్లూరి నాగప్ప, మల్లికార్జున్, మున్సిపల్ కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, నారాయణ, చిట్యాల లక్ష్మణ్, ప్రతాపరెడ్డి, విద్యాసాగర్, అశోక్ గౌడ్, బ్యాటరీ రాజు, కానాపురం రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా అంశాలను నవంబర్ 15 లోగా పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

రాష్ట్రంలో నియంత్రణల సరళీకరణ అమలులో తెలంగాణ సాధించిన ప్రగతిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుకృతి లిఖితో కలిసి శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం మొదటి దశలో నిర్దేశించిన మొత్తం 23 ప్రాధాన్యతా అంశాలను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని, తద్వారా 100 శాతం లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర జన విశ్వాస్ బిల్లును చట్టంగా రూపొందించడంతో మొదటి దశలో మిగిలి ఉన్న సంస్కరణ కూడా పూర్తయిందని వివరించారు. డీరెగ్యులేషన్ అండ్ కంప్లయెన్స్ రిడక్షన్ కార్యక్రమం రెండో దశలో మొత్తం 28 ప్రాధాన్యతా అంశాలు ఉన్నాయని, వీటిలో 23 తప్పనిసరి సంస్కరణలు, ఐదు ఐచ్ఛిక సంస్కరణలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇప్పటివరకు రెండో దశలో గుర్తించిన 28 అంశాల్లో 12 అంశాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని వెల్లడించారు. మిగిలిన ప్రాధాన్యతా అంశాలను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

తెలంగాణ సాధించిన ప్రగతిని అభినందించిన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుకృతి లిఖి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. నియంత్రణ నిబంధనలను క్రమబద్ధీకరించడం, వ్యాపార సంస్థలు, పౌరులపై అనుసరణ భారాన్ని తగ్గించడం ఈ డీరెగ్యులేషన్ అండ్ కంప్లయెన్స్ రిడక్షన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమం అమలులో తెలంగాణ సాధించిన ప్రగతిని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యకు భరోసా

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు రూ.40.68 కోట్ల బకాయిల విడుదల

**-32 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్య.. 225కుపైగా ప్రైవేటు పాఠశాలలకు ఊరట**

**-సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్యతోపాటు వసతి సౌకర్యాన్ని అందిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బస్ ) పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ పథకం కింద విద్యార్థులకు విద్యనందిస్తున్న రాష్ట్రంలోని 225కుపైగా ప్రైవేటు పాఠశాలలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.40.68 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 32 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసించడంతోపాటువసతిసౌకర్యాన్నిపొందుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా, పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిలను పరిష్కరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క గారి సహకారంతో రూ.40.68 కోట్ల నిధులను విడుదల చేయడం జరిగింది.

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి ప్రత్యేక చొరవలి**

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి సౌకర్యాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటంతోపాటు, పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిల పరిష్కారానికి సంక్షేమ శాఖ మంత్రిఅడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ బకాయిల విడుదలకు అవసరమైన చర్యలను వేగవంతం చేయడంలో మంత్రి కీలకంగా వ్యవహరించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు కేవలం ఆర్థిక పరిస్థితుల కారణంగా నాణ్యమైన విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రైవేటు పాఠశాలల్లో విద్య, వసతి, ఇతర అవసరమైన సదుపాయాలను కల్పించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందిస్తోంది. పాఠశాలలకు బకాయిల విడుదలతో విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత స్థిరత్వం చేకూరడంతోపాటు, పథకం అమలులో భాగస్వాములైన ప్రైవేటు పాఠశాలలకు కూడా ఆర్థికంగా ఊరట లభించనుంది. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్య ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యా ప్రగతికి మరింత ఊతమిస్తుందని అధికారులు తెలిపారు. ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే బకాయిల విడుదల జరిగిందని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

# ఈరోజు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**- సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేత**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల కారణంగా ఈరోజు కీసర, ఘట్‌కేసర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఆయా ఫీడర్ల పరిధిలో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఏఈ ఎస్. మురళీకృష్ణ తెలిపారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు, సమయాల వివరాలు:**

**1. 11 కేవీ శ్రీనగర్ ఫీడర్ (రాంపల్లి సబ్‌స్టేషన్):**
ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, చెర్లపల్లిరాంపల్లి రోడ్డు, సాయినగర్ కాలనీ, జ్యోతి కాలనీ, డీఎస్ఆర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

**2. 11 కేవీ యాద్గార్‌పల్లి ఫీడర్ (యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్):**
ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు యాద్గార్‌పల్లి గ్రామం, చిత్రమ్మ ఆలయం, టింబర్ డిపో, ఎస్సీ కాలనీ, రామస్వామి కాలనీ, యాద్గార్‌పల్లి ఏజీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదు.

**3. 11 కేవీ ఎస్ఎల్ఎన్ఎస్ ఫీడర్ (యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్):**
ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్ఎస్ఆర్ బృందావన్, గణేష్ టౌన్‌షిప్, ఎంఎల్ఆర్ కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, చీర్యాల గ్రామం, ఆర్‌కే నగర్, ఎన్ఎఫ్‌సీ కాలనీ, స్వరూప్ నగర్, రోజ్ గార్డెన్, శివసాయినగర్, ఈడెన్ గార్డెన్, మల్లన్న ఆలయం,



ఎస్ఎల్ఎన్ఎస్ హోమ్స్, ఎస్ఎల్ ప్రైమ్, సాయినగర్ కాలనీ, విజ్ఞాన్ ఎన్‌క్లేవ్, సాయి కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

**4. 11 కేవీ యమ్నంపేట్ ఫీడర్ (ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్):**
ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు ఇస్మాయిల్‌ఖాన్‌గూడెం, సాయిగూడెం, యమ్నంపేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.
వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# గండ్రాయి గ్రామ ఎంపీటీసీలు అభ్యర్థులుగా కొత్తపల్లి ఏడుకొండలు సతీమణి శ్రీమతి కొత్తపల్లి సుమలత

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం, గండ్రాయి గ్రామం టీడీపీ పార్టీ తరుపున ఎంపీటీసీలు సెగ్మెంట్ 1 మార్తి నరేష్ మరియు సెగ్మెంట్ 2 కు కొత్తపల్లి ఏడుకొండల సతీమణి శ్రీమతి కొత్తపల్లి సుమలత శుక్రవారం రోజున వారి ఇరువురు వారి నామినేషన్ పత్రాలను మండల పరిషత్ కార్యాలయం నందు సమర్పించడం జరిగింది.

# హుస్నాబాద్‌లో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చొరవను అభినందించిన కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించేందుకు హుస్నాబాద్‌లో చేపట్టిన కార్యక్రమంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్ర మంత్రి లేఖ

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**

హుస్నాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రస్తావించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ లేఖ రాశారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర వేడుకల్లో వినియోగించుకునేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల పూర్తి సెట్లతో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్లాస్టిక్ వినియోగాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలనుక్షేత్రస్థాయిలోతగ్గించేందుకుదోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి వివరించారు. అధిక కాలుష్యానికి కారణమయ్యే, తక్కువ ఉపయోగం కలిగిన గుర్తించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై ఉత్పత్తిదారుల విస్తరించిన బాధ్యత (ఈపీఆర్ ) అమలు, వస్తువులను తిరిగి వినియోగించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఇందులో భాగమని తెలిపారు. ప్లాస్టిక్‌కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తయారు చేసిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాల తయారీదారులు, విక్రేతల సంకలనం' (Compendium of Manufacturers/Sellers of Eco-alternatives)ను 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంకలనం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో కృషి చేస్తే ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్యాన్ని సమర్థవంతంగా, స్థిరమైన పద్ధతుల్లో నియంత్రించవచ్చని కేంద్ర మంత్రి తన లేఖలో అభిప్రాయపడ్డారు. గ్రామీణ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు 'స్టీల్ బ్యాంక్' ఒక ఉపయోగకరమైన ఆలోచనగా నిలుస్తుంది. శుభకార్యాల్లో స్టీల్ పాత్రలను తిరిగి వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన ఈ చొరవ పర్యావరణహిత జీవన విధానాల ప్రోత్సాహానికి దోహదపడనుంది.

# భారత్--జర్మనీ వాణిజ్య బంధం బలోపేతానికి అడుగులు

## బెర్లిన్‌లో పీయూష్ గోయల్ ఉన్నతస్థాయి సమావేశాలు పారిశ్రామిక సహకారం, భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు

**ట్రైనెట్ న్యూస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 23:**

భారత్--జర్మనీ మధ్య వాణిజ్య, పెట్టుబడులు, పారిశ్రామిక సహకారాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అక్టోబర్ 22న బెర్లిన్‌లో పలు ఉన్నతస్థాయి సమావేశాల్లో పాల్గొన్నారు. జర్మనీ ఆర్థిక వ్యవహారాలు, ఇంధన శాఖ మంత్రి కాథరీనా రైఖేతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంపొందించే అవకాశాలు, భారత్--యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులకు లభించే ప్రోత్సాహంపై చర్చించారు.జర్మన్ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ (డీజీఏపీ)లో ఏర్పాటు చేసిన 'ఇండియా సెంటర్'ను ఇరువురు మంత్రులు సంయుక్తంగా ప్రారంభించారు. భారత్--జర్మనీ సంబంధాలపై విధాన పరిశోధనలు, పరస్పర చర్చలకు ఈ కేంద్రం వేదికగా నిలవనుంది. డీజీఏపీ, ఆసియా--పసిఫిక్ కమిటీ ఆఫ్ జర్మన్ బిజినెస్ సంయుక్తంగా నిర్వహించిన భారత్--జర్మనీ వ్యాపార రౌండ్‌టేబుల్ సమావేశానికి గోయల్, రైఖే సహాధ్యక్షత వహించారు. జర్మనీకి చెందిన ప్రముఖ కంపెనీల సీఈవోలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, వాణిజ్యంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంపై గోయల్ ప్రసంగించారు. ప్రతిపాదిత భారత్--ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఆచరణాత్మక పారిశ్రామిక అవకాశాలుగా మలచుకోవాల్సిన అవసరాన్ని రైఖే వివరించారు.

బెర్లిన్ గ్లోబల్ డైలాగ్‌లో 'నూతన యుగం.. కొత్త భాగస్వామ్యాలు: మూడో మార్గం?' అనే అంశంపై జరిగిన చర్చలోనూ గోయల్ పాల్గొన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో పరస్పర విశ్వాసం, ఒకదానికొకటి తోడ్పడే ఆర్థిక బలాలు, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సరఫరా వ్యవస్థలు కీలకమని పేర్కొన్నారు. ఈ చర్చలో జర్మన్ చాన్సలర్ పెట్టుబడుల వ్యక్తిగత ప్రతినిధి మార్టిన్ బ్లెస్సింగ్, సింగపూర్ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్, మార్సెగాగ్లియా స్టీల్ ఛైర్‌వుమన్, సీఈవో ఎమ్మా మార్సెగాగ్లియా పాల్గొన్నారు. ప్రొఫెసర్ లార్స్--హెండ్రిక్ రోలర్ చర్చను సమన్వయం చేశారు.

వ్యాపార, పెట్టుబడి సహకార అవకాశాలపై బేయర్ ఏజీ బోర్డు సభ్యుడు, ఫార్మాస్యూటికల్స్ విభాగం అధ్యక్షుడు స్టెఫాన్ ఓల్రిచ్, క్నాఫ్ గ్రూప్ మేనేజింగ్ పార్ట్నర్ మురాత్ అక్యిల్డిజ్, ఫ్రెసెనియస్ సీఈవో మైఖేల్ సేన్‌లతో గోయల్ విడివిడిగా సమావేశమయ్యారు.జర్మనీ, నెదర్లాండ్స్ పర్యటనలో గోయల్ వెంట సుమారు 100 భారతీయ వ్యాపార సంస్థలు, అంకుర సంస్థల ప్రతినిధులతో కూడిన బృందం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, పారిశ్రామిక రంగాల్లో భారత్--జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా ఈ సమావేశాలు జరిగాయి.

# చిన్న మత్స్యకారుల జీవనోపాధికి జాతీయ కార్యాచరణ

## అంతర్గత జలాల్లో మత్స్యరంగ అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన ప్రారంభం

**ఐదేళ్లలో 3 కోట్ల టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యం: కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి**

**ట్రైనెట్ న్యూస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 23:**

దేశంలోని అంతర్గత జలాల్లో చిన్నస్థాయి మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడం, మంచినీటి వనరుల సమర్థ నిర్వహణ లక్ష్యంగా ప్రత్యేక జాతీయ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన దశ ప్రారంభమైంది. భోపాల్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ కార్యశాలలో కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి శుక్రవారం ఈ దశను లాంఛనంగా ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) మార్గదర్శక చట్రంలో కేంద్ర మత్స్యశాఖ, బంగాళాఖాత కార్యక్రమ అంతర్ ప్రభుత్వ సంస్థ (బీఓబీపీ--ఐజీఓ) సహకారంతో ఈ ప్రణాళికను రూపొందిస్తోంది.

ఈ సందర్భంగా అభిలక్ష్ లిఖి మాట్లాడుతూ.. ప్రతిపాదిత ప్రణాళికను దేశవ్యాప్తంగా మత్స్యకారులకు చేరువ చేసేందుకు ఉద్యమ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రణాళిక ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా మత్స్యకారుల జీవనోపాధిలో ఆచరణాత్మక మెరుగుదలకు దోహదపడాలని స్పష్టం చేశారు. వాతావరణ సంక్షోభం నేపథ్యంలో సుస్థిరతకు ప్రాధాన్యమిస్తూ, మత్స్యకారుల ఆదాయం పెరిగేలా ఉత్పత్తి నుంచి విక్రయం వరకు విలువ గొలుసును బలోపేతం చేయాలన్నారు.

రానున్న ఐదేళ్లలో దేశ చేపల ఉత్పత్తిని 3 కోట్ల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు రూ.1.25 లక్షల కోట్లకు




చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ వార్షిక చేపల ఉత్పత్తి 1.97 కోట్ల టన్నులకు చేరిందని, ఇందులో సుమారు మూడొంతులు అంతర్గత జలాల మత్స్యరంగం నుంచే సమకూరుతున్నాయని వివరించారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు రూ.70 వేల కోట్లు దాటాయని తెలిపారు. ఉత్పత్తి, ఎగుమతుల వృద్ధితోపాటు చిన్నస్థాయి మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం కూడా అంతే అవసరమని స్పష్టం చేశారు.

వాతావరణ మార్పులు, నీటి నాణ్యత క్షీణించడం అంతర్గత జలాల మత్స్యరంగానికి ప్రధాన సవాళ్లుగా మారుతున్నాయని లిఖి ఆందోళన వ్యక్తం చేశారు. జలవనరుల్లో ఆక్సిజన్ స్థాయులు తగ్గడం వంటి సమస్యలను ప్రస్తావించారు. ఈ పరిస్థితులను ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న మత్స్యకారుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, వాతావరణ మార్పులను తట్టుకునే చర్యలను ప్రణాళికలో చేర్చాలని సూచించారు. దేశంలోని విభిన్న జల పర్యావరణ వ్యవస్థలు, మత్స్యకార సమాజాలు, ప్రాంతాలవారీ సమస్యలకు అనుగుణంగా పరిష్కారాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌లో చేపట్టే ప్రాంతీయ ప్రయోగాలు, మత్స్యకారుల అనుభవాలు ఇతర ప్రాంతాల్లోనూ సుస్థిర మత్స్యవనరుల నిర్వహణకు ఉపయోగపడగలవని పేర్కొన్నారు. నదులు, కాలువలు, జలాశయాలు, సరస్సులు, వరద మైదాన చిత్తడి నేలలు, చెరువులు, శీతల జల వ్యవస్థల్లోని మత్స్య కార్యకలాపాలను ఈ ప్రణాళిక పరిధిలోకి తీసుకురానున్నారు.

చేపల వేట హక్కులు, వనరుల నిర్వహణ, ఉపాధి, గౌరవప్రదమైన పని పరిస్థితులు, లింగ సమానత్వం, చేపల సేకరణ అనంతర నిర్వహణ--వాణిజ్యం, విపత్తుల ముప్పు, వాతావరణ మార్పులు వంటి అంశాలపై ప్రణాళిక రూపకల్పనలో దృష్టి సారించనున్నట్లు బీఓబీపీ--ఐజీఓ డైరెక్టర్ డాక్టర్ పి. కృష్ణన్ తెలిపారు. మత్స్యకారులు, సంబంధిత భాగస్వాములతో సంప్రదింపుల అనంతరం ప్రణాళికను ఖరారు చేసి, వచ్చే నెలలో ప్రజల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. అనంతరం అమలు చేపట్టనున్నారు.

కార్యశాలలో మత్స్య పరిశోధనా సంస్థల నిపుణులు, సంబంధిత భాగస్వాములు ప్రణాళిక రూపకల్పనకు అవసరమైన ప్రాధాన్య అంశాలను గుర్తించి, కార్యాచరణ చట్రాన్ని సిద్ధం చేశారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ మత్స్యశాఖ కార్యదర్శి స్వతంత్ర కుమార్ సింగ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ గుంజన్ కృష్ణ, ఎఫ్ఏఓ ప్రాజెక్టు అధికారి గియులియా గొరెల్లి తదితరులు ప్రసంగించారు.

# సాగు నీరు అందక కన్నీరు పెడుతున్న అన్నదాతలు

**- ప్రశాంత పూరి తండాలో ఎండిపోతున్న వరి పంటలు**

**- కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ ఆగ్రహం**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చాక విద్యుత్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, అనధికారిక కోతలు, లో-వోల్టేజ్ సమస్యలతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ ఆరోపించారు. దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండలం ప్రశాంత పూరి తండాలో గురువారం ఆయన పర్యటించారు. నీరందక ఎండిపోతున్న వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత రైతుల కష్టాలను అడిగి



తెలుసుకున్నారు.
ప్రభుత్వం ఇస్తామన్న విద్యుత్ రాకపోగా, ఉన్న కొద్దిసేపు తీవ్రమైన లో-వోల్టేజ్ వస్తుండటంతో వేలాది రూపాయల విలువైన వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోయారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి రైతులను కాపాడారని, నాడు ఏరోజూ పంటలు ఎండలేదని బీల్యా నాయక్ గుర్తుచేశారు.
రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ఎన్నడూ బాగుపడదు అని, అన్నదాతల ఉసురు ఈ ప్రభుత్వానికి తగలక తప్పదని హెచ్చరించారు.
పంట నష్టపోయిన ప్రశాంత పూరి తండా రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# పవన్ కళ్యాణ్‌పై ప్రేమ.. కార్యకర్తలకు న్యాయం జరగాలనే ఆకాంక్ష! జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అడపామాణిక్యరావు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
2014 నుంచి జనసేన పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతూ, పార్టీ బలోపేతానికి తన జీవితాన్ని అంకితం చేసిన జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యరావు కు అన్యాయం జరగడం బాధాకరం. తనకు అన్యాయం జరిగినప్పటికీ, ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్‌ను విమర్శించకుండా, స్థానిక నాయకత్వంలోని లోపాలే కారణమని పేర్కొనడం ఆయనకు పవన్ కళ్యాణ్‌పై ఉన్న ప్రేమ, నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది. నాయకుడిని నిజంగా ప్రేమించే కార్యకర్త ఎప్పటికీ నాయకుడిపై ద్వేషం పెంచుకోడు. అయితే, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల సేవలను గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది. 24 గంటలూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే మాణిక్యరావు లాంటి నాయకులకు న్యాయం జరగాలి. వారి త్యాగాలకు తగిన గుర్తింపు లభించాలి. పవన్ కళ్యాణ్‌పై అభిమానం ఒకవైపు.. స్థానిక నాయకత్వంలో జరిగే తప్పులను ప్రశ్నించడం మరోవైపు. జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలంటే నిజాయితీగా పనిచేసే ప్రతి జనసైనికుడికి గౌరవం, న్యాయం దక్కాలి.

# జల చెంతకు అభ్యర్థులు.. ఇంటింటా ఎన్నికల ప్రచారం



**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
కొంకేపూడి ఎంపీటీసీ అభ్యర్థిని కట్టా నాగ తిరుమల, పెడన జడ్పీటీసీ అభ్యర్థిని కాగిత లక్ష్మి నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంకొంకేపూడి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కొంకేపూడి ఎంపీటీసీ అభ్యర్థిని కట్టా నాగ తిరుమల, పెడన జడ్పీటీసీ అభ్యర్థిని కాగిత లక్ష్మి నాగేశ్వరరావు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను కలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, ఎన్నికల్లో తమకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో నేరుగా మాట్లాడటం ద్వారా తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఓటర్లకు వివరించారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే తమ లక్ష్యమని ప్రచారంలో భాగంగా తెలియజేశారు.

# గూడూరు ఎంపీపీ పీఠమే లక్ష్యంగా బొల్లా రాజేష్ అడుగులు



**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
గూడూరు మండల పరిషత్ అధ్యక్ష పదవికి కూటమి అభ్యర్థిగా బొల్లా రాజేష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గూడూరు మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ క్రమంలో మండల పరిషత్ అధ్యక్ష పదవికి కూటమి తరఫున బొల్లా రాజేష్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో ఆయన నామినేషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. నిబంధనల ప్రకారం మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు మండల పరిషత్ పాలనలో కీలకంగా నిలవనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ పదవికి జరుగుతున్న ఎన్నికలు రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కూటమి అభ్యర్థిగా బొల్లా రాజేష్ నామినేషన్ దాఖలు చేయడంతో గూడూరు మండల రాజకీయాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. రానున్న ఎన్నికల్లో మండల పరిషత్ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు కూటమి శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి.

# అభివృద్ధే లక్ష్యంగా.. ప్రజాసేవే ధ్యేయంగా ముందడుగు!

## పెడన జడ్పీటీసీ అభ్యర్థినిగా కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు

**దావోజిపాలెం నుంచి కూటమి శ్రేణులతో బైక్ ర్యాలీ..**
**ఉత్సాహంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**



**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
పెడన మండల పరిషత్ పరిధిలో జడ్పీటీసీ అభ్యర్థినిగా కూటమి తరఫున కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పెడన మండలం దావోజిపాలెం గ్రామం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె బైక్ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరారు. కూటమి శ్రేణుల సందడి మధ్య సాగిన ఈ ర్యాలీ ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. దావోజిపాలెం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభ్యర్థికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆమె సంబంధిత కార్యాలయానికి చేరుకుని జడ్పీటీసీ అభ్యర్థినిగా నామినేషన్ పత్రాలను సమర్పించారు.

# చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం




**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
బాపట్ల జిల్లా చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఒంగోలుకు చెందిన హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ మునగంటి తేజస్విని, చీరాల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుభాషిణి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి, దాని లక్షణాలు, ముందస్తు గుర్తింపు, చికిత్స తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు ఉచితంగా 40 మందికి డెర్మల్ స్కాన్ పరీక్షలు, 25 మందికి జూా-125 పరీక్షలు, 10 మందికి పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే 6 మందికి PSA పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.
పరీక్షల అనంతరం డాక్టర్ మునగంటి తేజస్విని రోగులను పరిశీలించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన వైద్య సేవలు, చికిత్సను ఉచితంగా అందించేందుకు సహకరిస్తామని తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్సతో నియంత్రించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

## హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం త్వరలో ఏర్పాటు

**-కార్మికుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం**
**-పరిశ్రమల అభివృద్ధి--కార్మికుల సంక్షేమం రెండూ ముఖ్యం**
**శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో "సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్: రీబిల్డింగ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ సోషల్ డైలాగ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, భవిష్యత్తులో పని విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మిక రంగాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. దేశంలోని సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సంఘటిత రంగ కార్మికులకు ట్రేడ్ యూనియన్ల ద్వారా తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం పోరాడే అవకాశం ఉందని, అసంఘటిత రంగ కార్మికులకు ఆ స్థాయిలో ప్రాతినిధ్యం, రక్షణ లేదని అన్నారు. ఈ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్చలు, విధానపరమైన చర్యలు అవసరమన్నారు. తన తండ్రి గడ్డం వెంకటస్వామి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టే సమయంలో పారిశ్రామిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చినా, కార్మికుల ప్రయోజనాల కోసం ఆయన అండగా నిలిచారని తెలిపారు. గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ చేపట్టిన చొరవను మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ చొరవతోనే తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకొచ్చామని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామన్నారు. హమాలీ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరు సంక్షేమ బోర్డుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.
తెలంగాణలో గత పదేళ్లుగా కనీస వేతనాలను ప్రకటించలేదని, తాను కార్మిక శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత కనీస వేతనాలను ప్రకటించామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.
కార్మికులకు తగిన వేతనాలు, గౌరవప్రదమైన జీవనం అందినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని, పరిశ్రమల్లో పారిశ్రామిక శాంతి నెలకొంటుందని వివరించారు. పరిశ్రమలు, కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని మంత్రి అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఫ్యాక్టరీల తనిఖీల సందర్భంగా అధికారులు సూచించిన భద్రతా చర్యలను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు. తనిఖీ నివేదికలను కంపెనీల బోర్డు సమావేశాల్లో చర్చించి, భద్రతా లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతలను గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు.
తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు నైపుణ్యాభివృద్ధి కీలకమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీఎస్ ) అభివృద్ధి చేస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.
రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీలో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవకాశాలు ఉన్నాయని, అక్కడి సంస్థలతో చర్చల సందర్భంగా సుమారు 5 లక్షల ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పారు. తన నియోజకవర్గంలోని మందమర్రిలో 70 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని, వారికి తన సంస్థ తరఫున స్టైపెండ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు జర్మనీలో ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యూరప్, జపాన్ తదితర దేశాల్లో మారుతున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా స్థానిక భాషలు, ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ పొందడం అవసరమన్నారు.

విధాన నిర్ణయాల్లో కార్మికులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బలమైన ట్రేడ్ యూనియన్లు, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, అర్థవంతమైన సామాజిక సంభాషణ ద్వారా న్యాయబద్ధమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.
కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ ప్రతినిధులు, నిపుణులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్మిక సంస్కరణలు పరిశ్రమల అభివృద్ధికి దోహదపడటంతో పాటు కార్మికుల హక్కులను పరిరక్షించేలా ఉండాలని చెప్పారు. సదస్సులో వచ్చే ఆచరణాత్మక సూచనలను పరిశీలించి, కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా సాధ్యమైన మేరకు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ ఖుంతియా , తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

**- గ్రామ మండల మున్సిపల్ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే వాతావరణ మార్పులు, వర్షపాతం లోటు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయిలో సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.
శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జిల్లా స్థాయిలో నిర్వహించే కమిటీ సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమగ్ర ప్రళికలు తయారు చేయాలన్నారు.
జిల్లాలోని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా స్థానిక పరిస్థితులను అంచనా వేసి, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రణాళిక అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.
గ్రామస్థాయి నుంచి విద్యాసంస్థల వరకు అవగాహన కార్యక్రమాలు
ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ సూచించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలనీ,
అలాగే పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యార్థుల ద్వారా ఈ సందేశాన్ని కుటుంబాలకు, సమాజంలోని ఇతర వర్గాలకు చేరవేయాలనీ,
క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలకు ప్రాధాన్యత
నీటి వనరుల సంరక్షణ, చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపు, వర్షపు నీటి సంరక్షణ, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి.
ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన చర్యలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలనీ ఆదేశించారు.
జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నీటి సంరక్షణ , పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి జోజి, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి యాదయ్య,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు,వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్ ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,జిల్లా విద్యాధికారి రాజు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవనం సాధ్యం





**ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 23:**
మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవన విధానం సాధ్యమని డిస్ట్రిక్ట్ కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య నెలలో భాగంగా ముప్పాళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు, డ్రాయింగ్ మరియు వకృత్వ పోటీలు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ హెచ్.ఎం శ్రీమతి సి.హెచ్. ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటిసదస్సులుఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీ తత్వాన్ని అలవరచుకోవడం ద్వారా మానసిక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు.
అనంతరం కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టడం, కష్ట సమయాల్లో ఒత్తిడిని అధిగమించడం, ఆత్మహత్యల నివారణ మరియు మంచి కెరీర్ నిర్మాణం కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ, మానసిక ఆరోగ్యంపై సదస్సులు ఎంతో దోహదపడతాయని వివరించారు.
రెండు రోజుల పాటు జరిగిన ఈ అవగాహన సదస్సు, పోటీలలోవిద్యార్థులుఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి చేతుల మీదుగా అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి, కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుని ఎన్నిక.

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :



మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో మహబూబాబాద్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన గుగులోత్ కిషన్ నాయక్ ను రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల యూనిట్ అధ్యక్షులు రూప్ రెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైస నాగయ్య, కొండ బత్తుల ఈశ్వర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమన్వయకర్తగా మండల కార్యదర్శి కంపాటి మహేందర్ వ్యవహరించారు.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య మాట్లాడుతూ "గుగులోత్ కిషన్ నాయక్ అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలో ఉంటూ పేదల పక్షాన నిలబడ్డారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యునిగా నియమించడం మా సంఘానికి ఎంతో గర్వకారణం" అని అన్నారు. అనంతరం గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన సామాజిక సేవలను గుర్తించిన ప్రభుత్వానికి, తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలతో పాటు, సామాజిక ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నానని, పేదలు,విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి పక్షాన నిలబడి పోరాడుతున్నానని అన్నారు. విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పించడం, మహిళలకు వారి హక్కులపై చైతన్యం కల్పించడం, పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చేయడం తన ప్రధాన లక్ష్యమన్నారు. తనను కమిటీ సభ్యునిగా నియమించడం తన బాధ్యతను మరింత పెంచిందని, ఇది పదవి మాత్రమే కాదు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అన్నారు. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా దళిత, గిరిజన వర్గాలకు, మహిళలకు, పేదలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పర్యవేక్షిస్తానని, కుల వివక్ష లేని సమాజం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వలబోజు సోమయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగేందర్, మండల ఆర్థిక కార్యదర్శి రఘుపతి, గౌరవాధ్యక్షులు రత్నమాచారి, ఐ.వి. రమణయ్య, జిల్లా ముఖ్య సలహాదారులు సంక బద్రి నారాయణ, జిల్లా సంఘం అసోసియేట్ అధ్యక్షులు రంగారెడ్డి, గోవర్ధన్, మోహన్ రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కంబాల ఆధ్వర్యంలో ఘనంగా బీజేపీ ఎంపీటీసీ అభ్యర్థి నాగ వరలక్ష్మి నామినేషన్...





- దుర్గమ్మ అమ్మవారి దర్శనం అనంతరం పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ..

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :

తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం ఎంపీటీసీ1 స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా దోసపాటి పెద్ద సుబ్బారావు సతీమణి నాగ వరలక్ష్మి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ1 కంబాల శ్రీనివాసరావు బలపరిచిన అభ్యర్థిగా నాగ వరలక్ష్మి నామినేషన్ కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగింది. గోకవరంతంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం నుంచి కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు పార్టీ అభ్యర్థి నాగ వరలక్ష్మితో కలిసి అక్కడి నుంచి దేవిచౌక్‌లోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు నాగ వరలక్ష్మి, పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ పత్రాలను అమ్మవారి సన్నిధిలో ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం దేవిచౌక్ నుంచి అభ్యర్థి నాగ వరలక్ష్మితో కలిసి కంబాల శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో ర్యాలీగా కాలినడక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా నిలిచారు. అనంతరం గోకవరం ఎంపీటీసీ1 స్థానానికి నాగ వరలక్ష్మి తన నామినేషన్ పత్రాలను, కంబాల శ్రీనివాసరావుతో కలిసి అధికారులకు సమర్పించారు. అభ్యర్థి నాగ వరలక్ష్మికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# 25, 26వ తారీకు మల్టిపుల్ డేస్ మహాధర్నాన్ని జయప్రదం చేయండి





- సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్ర పల్లి సాంబశివరావు

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :

మణుగూరు మండలంలో అసంఘటిత సంఘటిత కార్మిక వర్గం కదంతో కలిసిన తరుణం ఆసన్నమైందని ఎఔబజిల్లా కమిటీ సభ్యులు సత్ర పల్లి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక హక్కుల సమస్యలు పరిష్కరించడంలో బిజెపి అడుగుజాడల్లో నడుస్తుందని నాలుగు లేబర్ కోళ్లు వ్యతిరేకించకుండా వాటిని రూల్స్ రూపొందించి అమలు చేయాలని రాష్ట్రంలో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్న నేటికీ పరిష్కరించట్లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి హమాలీల సమస్యలు పరిష్కరించడం లేదని అన్నారు సిఐటి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 26 25 తేదీలలో జరిగే మహాధర్నాన్ని జయప్రదం చేయాలని హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు అన్నారు ఈ సమావేశంలో ఆర్ శ్రీను. సత్యనారాయణ. రెడ్డి. సాంబయ్య రమేష్ కిషన్ తదితరులు పాల్గొన్నారు

# డి ఏ ఆర్ పి జి ఆధ్వర్యంలో 22వ జాతీయ ఇ-గవర్నెన్స్ వెబినార్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :





కేంద్ర పరిపాలన సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో 22వ జాతీయ ఇ-గవర్నెన్స్ వెబినార్ ను శుక్రవారం డిల్లీ నుండి ఘనంగా నిర్వహించారు.
ఈ వెబినార్ కు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తశీ
సంబందిత అధికారులతో హాజరయ్యారు.
ఈ సందర్భంగా జాతీయ ఇ-గవర్నెన్స్ అవార్డులు పొందిన విభాగాల ఉత్తమ పద్ధతులను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ విభాగాలకు తెలియజేయడం మరియు వారి అనుభవాలను పంచుకోవడం ఈ వెబినార్ ముఖ్య ఉద్దేశ్యం.
ఈ వెబినార్ లో 2024 జాతీయ ఇ-గవర్నెన్స్ అవార్డు పొందిన ఉజ్జయిన్ జిల్లా త్రినేత్ర' ప్రాజెక్ట్ పై ప్రత్యేకంగా చర్చించారు. ఇది ఏ ఐ ఆధారిత నిఘా వ్యవస్థ. యాత్రికుల సేవల డిజిటలైజేషన్ లో భాగంగా స్మార్ట్ టెంపుల్ ఎకో సిస్టమ్ ను రూపొందించడం ద్వారా మహాకాళేశ్వర్ ఆలయ నిర్వహణలో భద్రత, పారదర్శకత పెరిగిందని ఉజ్జయిన్ కలెక్టర్ ప్రథమ్ కౌశిక్ వివరించారు.
వికసిత్ గ్రామీణ్ భారత్ కోసం డేటా ఆధారిత అభివృద్ధి రెండవ అంశంగా గ్రామ పంచాయతీల సమగ్ర మరియు సుస్థిర అభివృద్ధి పై చర్చించారు.
దీని కోసం గ్రామ పంచాయతీ స్థాయిలో పి ఏ ఐ స్కోర్ ను ప్రవేశపెట్టినట్లు ఎన్ ఐ సి డైరెక్టర్ స్మితా జైన్ వివరించారు. డేటా ఆధారితంగా గ్రామాల అభివృద్ధిని ఎలా కొలవాలి, ప్రణాళికలు ఎలా రూపొందించాలి అనే అంశంపై ఆమె వివరణ ఇచ్చారు.
ఈ సందర్భంగా దేశంలోని అన్ని జిల్లాలు, పంచాయతీలు ఈ రెండు ఉత్తమ పద్ధతులను ఆదర్శంగా తీసుకొని ఇ-గవర్నెన్స్ ను మరింత బలోపేతం చేయాలని అన్నారు.
ఈ వెబినార్ లో జిల్లా ప్రణాళిక అధికారి వి.శ్రీనివాసరావు, అస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూములు ముంచొద్దు మా నీళ్లు తీసుకపోవద్దు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోండి....

- కల్వకుర్తి జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్
- పాలమూరు రైతుల పొట్టగొట్టేలా-డిండి ప్రాజెక్టు పేరుతో నీళ్ళ దోపిడీ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :



పాలమూరు ఎదరుగుండా 300 కిలో మీటర్లు కృష్ణా నది ప్రవహిస్తున్న 80 ఏండ్లుగా పాలమూరు జిల్లా రైతాంగం సాగు,తాగు నీళ్ళు కోసం తండ్లాట పడుతుందని డిండి ప్రాజెక్టు పేరుతో మా భూములు ముంచొద్దు,మా నీళ్లు తీసుకపోవద్దు,
మా రైతాంగం పొట్ట కొట్టొద్దని రైతు ఉద్యమ నాయకుడు కల్వకుర్తి జేఏసీ చైర్మన్ అయిల్ సదానందం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.
పార్టీలుమారుతున్నారు,ప్రభుత్వాలుమారు తున్నాయి,పాలకులుమారుతున్నారు. కానీఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగంబతుకులు మాత్రం మారడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలమూరు జిల్లాను కరువు జిల్లా, వలసల జిల్లాగా చేసి నీళ్ళ పంపిణీలో తీవ్రంగా అన్యాయం చేసింది. స్వరాష్ట్రంలో కూడా నల్లగొండ జిల్లా రాజకీయ నేతలు ఆధిపత్యంతో పాలమూరు రైతుల పొట్టగొట్టేలా డిండి ప్రాజెక్టు పేరుతో నీళ్ళ దోపిడికి తెరలేపారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లా రైతుల పక్షాన ఉద్యమించడానికి ఏ రాజకీయ పార్టీ కూడా ముందుకు రాలేని దుస్థితిల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులతో ఎర్రటి ఎండలో ధర్మ సత్యాగ్రహ దీక్ష,రైతుల మహా పాదయాత్ర,రైతాంగం మహాధర్నా కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్నికదిలించేలా చేశాయి అని పేర్కొన్నారు
ఉమ్మడిపాలమూరుజిల్లాఎమ్మెల్యేలు,మంత్రులు, ఎంపీలను ఏకతాటిపైకి నిలపడం లో జేఏసీ సక్సెస్ అయింది. మనం చేసే పనిలో నీతి,నిజాయితీ,ధర్మం ఉంది కచ్చితంగా ప్రభుత్వం మన పాలమూరు జిల్లా రైతాంగానికి
న్యాయం
జరుగుతుందనే
ఆశాభావం వ్యక్తం
చేశారు. తక్షణమే
డిండి ప్రాజెక్టు రద్దు చేసి,ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి
న్యాయం
చేయాలన్నారు. జిల్లాల మధ్యన జల వివాదాలు పరిష్కరించడం కోసం నల్లగొండ జిల్లా రైతాంగానికినాగార్జునసాగర్,శ్రీశైలం,గుర్రంపోడు,ఎసె ల్బిసి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించి మునుగోడు,దేవరకొండ రైతాంగానికి నీళ్ళు ఇవ్వాలని కల్వకుర్తి జెఏసి చైర్మన్ సదానందం గౌడ్ సూచించారు.

# లక్నారం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డి ఈవో : రమేష్ కుమార్






ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :



తెలకపల్లి మండల పరిధిలోని లక్నారం గ్రామ ఎంపీ హెచ్ ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన అభ్యసన సామర్థ్యాలు ఉపాధ్యాయుల బోధన పద్ధతుల పాఠశాల నిర్వహణ విద్యా ప్రమాణా లు తదితర అంశాలపై పరిశోధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించుటకు ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం తో పాటు చదువుపై విద్యార్థులు ఆసక్తి ని పెంపొందించేల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అమ్మకం...

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23 :



మద్యం బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. మండలంలోని వడ్లమన్నాడులో శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతూ సీహెచ్ రాము అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఐదు 180ఎంఎల్ బాటిల్స్‌ను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ తెలిపారు.

# రేషన్ బియ్యంతో పాటు మరో ఆరు సరుకులు!

## సబ్సిడీ ధరలకు పంపిణీపై ప్రభుత్వ కసరత్తు




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
తెలంగాణలో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యంతో పాటు మరో ఆరు రకాల నిత్యావసర సరుకులను రాయితీ ధరలకు అందించే ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పెరుగుతున్న ధరలతో సామాన్య కుటుంబాలపై పడుతున్న భారాన్ని తగ్గించే లక్ష్యంతో పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.రేషన్ దుకాణాల ద్వారా గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు నెలవారీ నిత్యావసర ఖర్చుల్లో కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

**సమగ్ర నివేదికకు మంత్రి ఆదేశం**

ఈ అంశంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సరుకుల సేకరణ, కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ఇవ్వాల్సిన పరిమాణం, నిల్వ, రవాణా, పంపిణీ ఏర్పాట్లపై సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదన అమలుకు ఏటా అవసరమయ్యే నిధులు, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని కూడా అంచనా వేయాలని సూచించారు.

**ఆహార భద్రతపై ముందస్తు ప్రణాళిక**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, పంటల దిగుబడులు తగ్గితే నిత్యావసరాల ధరలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఆహార భద్రతపై దృష్టి సారిస్తోంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు అవసరమైన సరుకులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సుమారు 3.42 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. నెలకు దాదాపు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుండగా, ప్రభుత్వ గోదాముల్లో సరిపడా నిల్వలు ఉన్నట్లు సంబంధిత వివరాలు పేర్కొంటున్నాయి.

అధికారుల నివేదిక అందిన తర్వాత ఆరు సరుకుల పంపిణీపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, సరుకుల ధరలు, ఒక్కో కుటుంబానికి ఇచ్చే పరిమాణం, పంపిణీ ప్రారంభ తేదీ ఇంకా ఖరారు కాలేదు. వీటిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# కేటీఆర్ కు శుభాకాంక్షలు తెలిపిన పసరకొండ కిశోర్...

## – పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తా : కిశోర్



**ట్రైనెట్ న్యూస్, అంబర్ పేట అక్టోబర్ 23**
: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో పసరకొండ కిశోర్ మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల ను దృష్టిలో ఉంచుకు ని పట్టభద్రుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించాలని కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడు తూ... పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేస్తానని పసరకొండ కిశోర్ స్పష్టం చేశారు. అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నాయకత్వంలో బీఆర్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పట్టభద్రులకు అండగా ఉంటానని, ప్రతి పట్టభద్రుడిని కలిసి గెలుపు కోసం కృషి చేస్తానని కెటీఆర్ కు వివరించినట్లు తెలిపారు.

# పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

## ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయ యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**-శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి నిదర్శనం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**-నిధులు మంజూరు కావటంతో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరిన కాంగ్రెస్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ నేతలను కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఇరు పార్టీల నేతలు సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డితో పాటు ఇతర రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సీపీఐ మద్దతు, ఉమ్మడి కార్యాచరణపై నేతలు చర్చించారు.

# ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ

## గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు -- మంత్రి వాకిటి శ్రీహరి

**డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు.. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**
**27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక.. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 23:**
తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం-మంత్రి వాకిటి శ్రీహరి**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు.

క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

**స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం**

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా నిర్వహణ**

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలని పేర్కొన్నారు.

సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ బీహెచ్‌యూలో సీ--డాట్ ఆరో పరిశోధనా కేంద్రం

## అత్యాధునిక టెలికాం సాంకేతికతల అభివృద్ధికి అవగాహన ఒప్పందం

**-5జీ అడ్వాన్స్‌డ్, 6జీ, ఏఐ, క్వాంటం పరిశోధనలపై ప్రత్యేక దృష్టి**



**ట్రైనెట్ న్యూస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 23**
: దేశీయ టెలికాం సాంకేతిక పరిశోధనలకు ఊతమిచ్చేలా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ--డాట్) మరో కీలక ముందడుగు వేసింది. వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీహెచ్‌యూ)లో తన ఆరో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలికమ్యూనికేషన్ల విభాగానికి చెందిన సీ--డాట్, ఈ భాగస్వామ్యంతో తదుపరి తరం సమాచార సాంకేతికతల అభివృద్ధికి ఉమ్మడి పరిశోధన వేదికను ఏర్పాటు చేసింది. విద్యాసంస్థల్లో జరిగే పరిశోధనలను టెలికాం రంగంలోని వాస్తవ అవసరాలతో అనుసంధానించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. సీ--డాట్ సాంకేతిక నిపుణులు, ఐఐటీ బీహెచ్‌యూ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు కలిసి సంయుక్త పరిశోధనలు చేపట్టనున్నారు. సాంకేతిక పరిజ్ఞాన మార్పిడితోపాటు టెలికాం రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దనున్నారు. ఈ కేంద్రంలో 5జీ అడ్వాన్స్‌డ్, 6జీ, అధునాతన వైర్‌లెస్ వ్యవస్థలు, కృత్రిమ మేధ ఆధారిత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, సైబర్ భద్రత, క్వాంటం సాంకేతికతలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. భారీ స్థాయి మల్టిపుల్ ఇన్‌పుట్--మల్టిపుల్ అవుట్‌పుట్ (మైమో) వ్యవస్థలు, సెన్సింగ్--కమ్యూనికేషన్ సమీకృత సాంకేతికత, క్వాంటం, పోస్ట్ క్వాంటం కమ్యూనికేషన్ రంగాల్లోనూ పరిశోధనలు నిర్వహించనున్నారు.

సీ--డాట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పంకజ్ కుమార్ దలేలా, ఐఐటీ బీహెచ్‌యూ డైరెక్టర్ ప్రొఫెసర్ అమిత్ పాత్రా సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యాపకులు, సీ--డాట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు.

ఈ కేంద్రం భారత భవిష్యత్ సాంకేతిక సామర్థ్యాలపై పెట్టుబడిగా నిలుస్తుందని సీ--డాట్ సీఈవో డాక్టర్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయ పేర్కొన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికతలు, అధునాతన వైర్‌లెస్ వ్యవస్థలు, మేధో ఆధారిత నెట్‌వర్క్‌లు తదుపరి తరం సమాచార వ్యవస్థలను తీర్చిదిద్దనున్నాయని తెలిపారు. దేశ డిజిటల్ భవిష్యత్తుకు అవసరమైన స్వదేశీ సాంకేతికతల అభివృద్ధిని ఈ భాగస్వామ్యం వేగవంతం చేస్తుందని వివరించారు.

విద్యా పరిశోధనలను ప్రయోజనకరమైన సాంకేతిక పరిష్కారాలుగా మలిచేందుకు ఈ సహకారం బలమైన వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ అమిత్ పాత్రా తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెలికాం రంగంలోని వాస్తవ సవాళ్లపై పనిచేస్తూ అధునాతన కమ్యూనికేషన్ సాంకేతికతల్లో దేశ స్వావలంబనకు తోడ్పడతారని పేర్కొన్నారు.

ఇప్పటికే ఐఐటీ కాన్పూర్, ఐఐటీ గాంధీనగర్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ హైదరాబాద్‌తోపాటు ఎఫ్ఎస్ఐడీ ద్వారా బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌తో సీ--డాట్ భాగస్వామ్యాలు కొనసాగిస్తోంది. వారణాసి కేంద్రం ఏర్పాటుతో దేశవ్యాప్తంగా సీ--డాట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సంఖ్య ఆరుకు చేరింది.

# బ్యాంకింగ్‌లో స్వదేశీ క్వాంటం సాంకేతికతలకు ఊతం

## సీ--డాక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం

**భద్రత, ఆర్థిక విశ్లేషణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**



**ట్రైనెట్ న్యూస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 23:**
బ్యాంకింగ్ రంగంలో స్వదేశీ క్వాంటం సాంకేతికతలు, ఆధునిక డిజిటల్ పరిష్కారాల వినియోగానికి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ--డాక్), బ్యాంక్ ఆఫ్ ఇండియా చేతులు కలిపాయి. సంయుక్త పరిశోధనలు, ప్రయోగాత్మక అమలు, సాంకేతిక ప్రదర్శనలు, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా అక్టోబర్ 22న అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి శాస్త్రీయ సంస్థ సీ--డాక్‌కు అధిక సామర్థ్య కంప్యూటింగ్, కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికతలు, బ్లాక్‌చెయిన్, సైబర్ భద్రత రంగాల్లో ఉన్న పరిజ్ఞానాన్ని ఈ భాగస్వామ్యంలో వినియోగించనున్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఉన్న బ్యాంకింగ్ అనుభవం, దేశవ్యాప్త కార్యకలాపాలు, భారీ స్థాయి సాంకేతిక వ్యవస్థలతో దీనిని అనుసంధానించనున్నారు.

ఆర్థిక రంగంలో ఆవిష్కరణలకు తోడ్పడే క్వాంటం సాంకేతిక వాతావరణాన్ని అభివృద్ధి చేయడం ఈ ఒప్పందంలో ప్రధాన అంశం. క్వాంటం సాంకేతికతలతో అందుబాటులోకి వచ్చే అవకాశాలతోపాటు ఎదురయ్యే భద్రతా సవాళ్లకు బ్యాంకింగ్ వ్యవస్థలను సిద్ధం చేయనున్నారు. భద్రత, విశ్వసనీయత, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం, నిర్ణయ ప్రక్రియలను మెరుగుపరిచేందుకు క్వాంటం ప్రేరిత, క్వాంటం దాడులను తట్టుకునే సాంకేతికతలను సంయుక్తంగా పరిశీలించనున్నారు. బ్యాంకింగ్‌లో ప్రాధాన్య అవసరాలను గుర్తించి, నియంత్రిత సురక్షిత ప్రయోగ వాతావరణంలో నమూనా పరిష్కారాలను పరీక్షించనున్నారు. వాటి సాంకేతిక సాధ్యత, బ్యాంకింగ్‌కు కలిగే ప్రయోజనాలను అంచనా వేసి, ప్రస్తుతం వినియోగిస్తున్న వ్యవస్థలతో పనితీరును పోల్చనున్నారు. ఫలితాల ఆధారంగా తదుపరి అభివృద్ధి, ప్రయోగాత్మక అమలు,వినియోగానికికార్యాచరణరూపొందించనున్నారు. పెరుగుతున్న సైబర్ భద్రతా ఆందోళనలు, కొత్త సాంకేతిక ముప్పుల నేపథ్యంలో క్వాంటం సవాళ్లను తట్టుకునే ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ పేర్కొన్నారు. స్వదేశీ ఆవిష్కరణల కోసం సీ--డాక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న బ్యాంక్ ఆఫ్ ఇండియాను అభినందించారు. దేశీయ క్వాంటం, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను ఆచరణాత్మక బ్యాంకింగ్ పరిష్కారాలుగా మలచడంలో ఈ ఒప్పందం కీలక అడుగని సీ--డాక్ డైరెక్టర్ జనరల్ ఇ. మగేష్ తెలిపారు. సంయుక్త పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా సురక్షితమైన, భవిష్యత్ అవసరాలకు సిద్ధమైన ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతామని పేర్కొన్నారు.

సైబర్ భద్రత నుంచి సంక్లిష్ట ఆర్థిక నిర్ణయాల వరకు బ్యాంకింగ్‌లోని అనేక అంశాలను క్వాంటం సాంకేతికతలు ప్రభావితం చేయగలవని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ మిశ్రా తెలిపారు. ఈ అవకాశాలను క్రమబద్ధంగా పరిశీలిస్తూ, తదుపరి తరం సాంకేతికతలకు అవసరమైన పరిజ్ఞానం, సామర్థ్యాలను పెంపొందించుకుంటామని వివరించారు. క్వాంటం సాంకేతికతలతోపాటు కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్ తదితర రంగాల్లోనూ సహకారానికి ఒప్పందం అవకాశం కల్పిస్తోంది. పత్రాల సమాచారాన్ని స్వయంచాలకంగా విశ్లేషించడం, ఖాతాదారులు--ఉద్యోగులకు సాంకేతిక సహాయం, మోసాల విశ్లేషణ, రుణ--ఆర్థిక విశ్లేషణలు, సురక్షిత ఏఐ వేదికలు, బాధ్యతాయుత ఏఐ వినియోగం, స్మార్ట్ కాంట్రాక్టులు, డిజిటల్ గుర్తింపు, సురక్షిత సమాచార మార్పిడి వంటి అంశాలను పరిశీలించనున్నారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం భద్రత, ఏఐ, బ్లాక్‌చెయిన్ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

సీ--డాక్ ముంబై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ సిన్హా, బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం--ఐటీ, సీఐఓ సత్యేంద్ర సింగ్ ఒప్పంద పత్రాలను పరస్పరం అందజేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్. కృష్ణన్, రాజీవ్ మిశ్రా, మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుదీప్ శ్రీవాస్తవ, ఇ. మగేష్‌తోపాటు ఆయా సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.